# పాడి పంటలు

వ్యవసాయ, ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ రైతుల సచిత్ర మాసపత్రిక

సంపుటి : 01 సంచిక : 06 డిసెంబర్ - 2024 పేజీలు : 44

# అన్నదాతకు అండగా...

## రూ.43,402 కోట్లతో వ్యవసాయ బడ్జెట్



# నేలను సంరక్షించుకుందాం

ఆరోగ్యవంతమైన నేల అధిక దిగుబడులు పొందటానికి ప్రామాణికం. విచక్షణారహితంగా ఎరువుల వినియోగం ఆమోదయోగ్యం కాని రీతిలో కలుపు మందులు ,గుళికల రూపం లో నేలకి అందించే పురుగుమందుల వాడకం వల్ల తరాలకు సాగు భూమి అందించే విషయం లో సందిగ్దం నెలకొంది. ఇటువంటి పరిస్థితుల్లో నేలను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపైన ఉంది. ఆరోగ్యంవంతమైన పంట పండేందుకు తోడ్పడే కారకాలైన బ్యాక్టీరియా, ఫంగై, ఆల్గే తో పాటు అనేక జీవులు ఉన్నాయి. సేంద్రియ వ్యర్ధాలను కుళ్ళించి ఎరువుగా మార్చి భూమి లోపల పొరల్లో ఉండిఅందుబాటు కానీ పోషకాలను మొక్కకు అందిస్తాయి .



రసాయన ఎరువులు,
నీటిని సాగు నీరు గా వాడటం వల్ల
సూక్ష్మ జీవులు నశించి, మట్టి
భౌతిక స్వరూపం మారి
భూమిలోని సూక్ష్మజీవుల
పట్టి ఉంచే గుణం పెరిగి
పెరిగి మంచి దిగుబడికి
మెరుగు పడటానికి

ఫ్యాక్టరీ వ్యర్థాలతో కలిసిన
భూమిలోని మొక్కకు ఉయోగపడే
కదలిక లేక పోవటం వలన భూమి
భూ ఆరోగ్యం దెబ్బతింటుంది.
చర్యల వలన భూమికి నీటిని
మొక్క వేర్లు ఆరోగ్యంగా
తద్వారా రైతు ఆర్థిక పరిస్థితి
తోడ్పడుతుంది .

రసాయన ఎరువులు
వర్మీ కంపోస్ట్ వేసుకోవాలి,
మూత్రంతో కలిపిన
నేలను సేంద్రియ
మందులు, గుళికల
పురుగుమందులు
తగ్గించాలి.

వినియోగం తగ్గించి
లేనిపక్షంలో ఆవు పేడ ఆవు
ద్రవ జీవామృతం కూడా వాడి
పరుచుకోవచ్చు. కలుపు
రూపంలో ఉన్నటువంటి
వాడకం పూర్తిగా

## ప్రపంచ నేల దినోత్సవం

డిసెంబర్ 5

అన్ని కాలాల్లో పచ్చని మొక్కలతో నేలను కప్పి ఉంచితే ఆరోగ్యవంతమైన నేల మన సొంతం.

మన నేలను మనమే సంరక్షించి
భావి తరాలకు మంచి నేలను అందించాలి

# పాడి పంటలు

## సంపాదకీయం



ప్రధాన సంపాదకులు
**శ్రీ ఎస్. ఢిల్లీ రావు,** ఐ.ఏ.ఎస్.
డైరెక్టర్ వ్యవసాయ శాఖ



సంపాదకులు
**శ్రీ వల్లూరి శ్రీధర్**
అడిషనల్ డైరెక్టర్

కార్యనిర్వాహక సంపాదకులు
**శ్రీ వి. హరగోపాలరాజు**

సహాయ సంపాదకులు
**శ్రీమతి వై. అనురాధ,** డి.డి.ఎ.
**శ్రీ డి. వెంకటేశ్వర్లు,** డి.డి.ఎ.
**డా. బి.ఎస్. శ్రీ నివాసాచార్యులు** ఎ.డి.ఎ.
**శ్రీ జి. వి. శివప్రసాద్** ఎ.ఒ

'పాడి పంటలు' సచిత్ర మాసపత్రిక
సంవత్సర చందా - రూ.300/-
యూనియన్ బ్యాంక్, గోరంట్ల శాఖ
IFSC Code-UBIN0806960
ఖాతా నెం.069610100200430 కు
నేరుగా గూగుల్ పే, ఫోన్ పే ద్వారా
పంపవచ్చు.

రచనలు పంపవలసిన చిరునామా
సమీకృత రైతు సమాచార కేంద్రం,
HCL పక్కన, గన్నవరం
mediaproductionap@gmail.com

### వ్యవసాయానికి సాంకేతిక దన్ను

దేశానికి అన్నపూర్ణగా పేరు గాంచిన ఆంధ్రప్రదేశ్ కు ఆ పేరును శాశ్వతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. అందుకు అనుగుణంగా వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ. 43,402 కోట్లతో బడ్జెట్ కేటాయింపులను ప్రతిపాదించింది.

పంటల సాగుకు కీలకమైన భూసార పరీక్షలు, కార్డుల జారీకి ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వ నుంది. అలాగే ఉపగ్రహ సాంకేతికత సాయంతో మట్టి పరీక్షలకు వినూత్న విధానం తీసుకు రాబోతున్నారు.

భూయజమానుల హక్కులకు భంగం కలగకుండా వాస్తవ సాగుదారులకు మరిన్ని ప్రయోజనాలు కల్పించేందుకు కొత్త చట్టం ప్రవేశపెట్టనుంది.

వ్యవసాయ వ్యక్తిగత పనిముట్లను రాయితీపై పంపిణీ చేయడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అలాగే సాగును మరింత సులభతరం చేసి, పెట్టుబడులు తగ్గించి, అధిక దిగుబడులు ధ్యేయంగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తోంది. వ్యవసాయంలో డ్రోన్లు ప్రవేశ పెట్టడం వల్ల ఎరువులు, పురుగు మందులు పిచికారీ సులభతరమై వనరుల వినియోగ సామర్థ్యం పెరిగి రైతుకు పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది. కూలీల కొరతతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న రైతుకు ఊరట కలుగుతుంది. గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

సాంకేతికతను అందిపుచ్చుకుని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలని నిర్ణయించింది. ప్రతి రైతుకు చెందిన వ్యక్తిగత, కుటుంబ, వ్యవసాయ సమాచారాన్ని సేకరించి ప్రభుత్వ పథకాలతో అనుసంధానించనున్నామని బడ్జెట్లో ప్రతిపాదించారు.


ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు కార్డు ఇస్తూ ఫార్మర్స్ రిజిస్ట్రీ రూపొందించనున్నారు. అగ్రిస్టాక్ పథకం కింద డిజిటలైజ్డ్ రికార్డులు, విశిష్ట గుర్తింపు సంఖ్య, సమగ్ర డేటాబేస్ వ్యవస్థ, జియో రిఫరెన్స్ గ్రామ పటాలు తదితర సేవల రూపకల్పన సేవలు అందించేందుకు ప్రభుత్వం సంసిద్ధ మవుతోంది.

యాప్ ల ఆధారంగా పంట పొలాల్లో పురుగులు, తెగుళ్ళ ఉధృతిని, పోషక లోపాలను అంచనా వేస్తారు. కృత్రిమ మేధ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎం.ఎల్) ప్రక్రియలతో వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు రైతులకు సలహాలు ఇస్తారు.

దేశీయ పండ్ల ఉత్పత్తిలో 15.60 శాతం వాటా కలిగిన ఉద్యాన రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇవ్వనుంది. స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాల్లో భాగంగా 11 ఉద్యాన పంటలను క్లస్టర్ విధానంలో ప్రోత్సహిస్తున్నారు. 7.50 లక్షల ఎకరాల్లో సూక్ష్మ సేద్యం అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

వ్యవసాయాధారిత రాష్ట్రంలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా అండగా నిలవనుంది.

# లోపలి పేజీల్లో...



అన్నదాతల సాగు ఖర్చులు తగ్గించాలి
5

అన్నదాతకు అండగా
6





మొక్కజొన్న లో ఎరువుల యాజమాన్యం
12

శనగ లో తెగుళ్ళ యాజమాన్యం
20





వేసవి దాహం తీర్చే కర్బూజా
26

వంగ లో కొమ్మ,కాయ తొలుచు పురుగు యాజమాన్యం
32




8 వాస్తవ సాగుదారులకు మేలు చేసేలా .. కొత్త కౌలు చట్టం -2024..

10 ఈ మాసం వ్యవసాయ పనులు

14 పత్తి తీత-అనంతరం జాగ్రత్తలు

16 కందిలో సస్య రక్షణ

18 రబీ పంటల్లో కలుపు నివారణ

22 పొలం పిలుస్తోంది

23 క్లిక్ .. క్లిక్

24 పూలతో వంటలు

28 కొబ్బరిలో నల్లముట్టె పురుగు .. జీవ నియంత్రణ

30 కాలీఫ్లవర్ సమస్యలు –నివారణ

34 పుంగనూరు ఆవు విశిష్టత

35 బంతి పూల సాగు...ఆదాయం భలే బాగు

36 ముంపుకు గురైనా ..

37 సేంద్రియ పద్ధతిలో పెరటి సాగు

38 రైతుల సందేహాలు..సమాధానాలు

40 వాట్సాప్ సందేహాలు...సమాధానాలు

42 సమీకృత రైతు సమాచార కేంద్రం పై రైతుల స్పందన



# సాగు ఖర్చులు తగ్గించాలి

- ప్రకృతి సేద్యం రానున్న రోజుల్లో గేమ్ ఛేంజర్ అవుతుంది.
- ప్రకృతి సేద్యం – అగ్రిడీప్ టెక్ విధానంతో దేశానికి ఏపి దిక్సూచి అవుతుంది.
- డ్రోన్ల ద్వారా పిచికారీతో 30% పైగా పురుగు మందు ఆదా చేయొచ్చు.
- 95% సమయం, నీరు, పవర్ ఆదా చేసి... ఖర్చును తగ్గించవచ్చు.

**వ్యవసాయ శాఖ సమీక్షలో సి.ఎం**

రైతును నిలబెట్టి, సాగును మరింత ప్రోత్సహించేందుకు అవసరమైనన్ని నూతన విధానాలను రాష్ట్రంలో వ్యవసాయ శాఖ అమలు చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. నేటి ఆధునిక యుగంలో సాంకేతికతను వినియోగించి రైతులకు సాగు ఖర్చులు గణనీయంగా తగ్గించ వచ్చని సీఎం అభిప్రాయ పడ్డారు. నాడు ఐటీ ఎలా అయితే గేంఛేంజర్ అయ్యిందో... రానున్న రోజుల్లో ప్రకృతి వ్యవసాయం కూడా గేంఛేంజర్ అవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రకృతి సేద్యంలో ఏపి పయనీర్ గా నిలవాలని.... దీనికి టెక్నాలజీని జోడించడం ద్వారా అనూహ్య, అద్భుత ఫలితాలు సాధించవచ్చని సిఎం అన్నారు. ప్రకృతి సేద్యం – అగ్రిడీప్ టెక్ విధానంతో దేశానికి ఏపి వ్యవసాయ రంగంలో దిక్సూచి అయ్యేలా చేయాలని... అందుకు అవసరమైన ప్రణాళికలను అమలు చేయాలని సీఎం ఆదేశించారు. ఖర్చులు గణనీయంగా పెరిగి రైతులకు సాగు భారంగా మారిన పరిస్థితుల్లో టెక్నాలజీ ద్వారా ఆ ఖర్చులు తగ్గించాలని అన్నారు. పంటల సాగులో డ్రోన్ల వాడకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో పంటల సాగుకు 40 వేల డ్రోన్లు అవసరం పడతాయని అధికారులు వివరించారు. సాగులో డ్రోన్లకు కేంద్ర ప్రభుత్వం రూ.8 లక్షల వరకు సబ్సిడీ ఇస్తుందని.... తక్కువ వడ్డీతో రుణ సదుపాయం కూడా కల్పిస్తుందని... ఈ పథకాన్ని వినియోగించుకోవాలని సీఎం సూచించారు. డ్వాక్రా సంఘాల్లోని మహిళలకు డ్రోన్ లపై శిక్షణ ఇచ్చి డ్రోన్ పైలెట్లుగా తీర్చిదిద్దితే ఇదొక కుటీర పరిశ్రమ అవుతుందన్నారు.

ప్రకృతి సేద్యంతో సాగయ్యే పంటలు సాధారణ పంటలకంటే ఎక్కువగా వరదలు, విపత్తులను తట్టుకుంటున్నట్లు పరిశీలనలో తేలిందని అధికారులు వివరించారు. రెండు నెలల క్రితం వచ్చిన భారీ వర్షాలు, వరదల సమయంలో చేసిన స్టడీలో ఈ విషయాలు వెలుగు చూశాయని తెలిపారు. అంతకుముందు అధికారులు పంట ఉత్పత్తుల పెంపు, సాగు విస్తీర్ణం పెంపు, భూసార పరీక్షలు వంటి అంశాల్లో తీసుకున్న చర్యలను సీఎంకు వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ద్వారా భూసార పరీక్షలు చేసి రైతులకు అవసరమైన పోషకాలు అందించే పరిస్థితి రావాలని సీఎం అన్నారు. జులై నెలలో జరిగిన పంటనష్టానికి సంబంధించి రూ.37 కోట్లు రైతులకు పరిహారం కింద చెల్లించాల్సి ఉందని అధికారులు చెప్పగా...ఆ నిధుల విడుదలకు సీఎం అంగీకారం తెలిపారు. సెప్టెంబర్ నెలలో వచ్చిన వరదలతో రైతుల పంటనష్టానికి గాను రూ.319 కోట్లు నెలరోజుల వ్యవధిలోనే చెల్లించినట్లు అధికారులు తెలిపారు. క్యాబినెట్ సబ్ కమిటీ సూచనల ప్రకారం ఈ రబీ నుంచి పాత పద్ధతిలో క్రాప్ ఇన్స్యూరెన్స్ అందుబాటులోకి తెస్తున్నట్లు అధికారులు తెలిపారు. సమీక్షలో మంత్రి అచ్చెన్నాయుడు, అధికారులు పాల్గొన్నారు.




# అన్నదాతకు అండగా... రూ.43,402 కోట్లతో వ్యవసాయ బడ్జెట్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే రైతుల అభ్యున్నతే లక్ష్యంగా భూసార పరీక్ష పత్రాల జారీ, పొలం పిలుస్తోంది, ఫార్మర్స్ రిజిస్ట్రీ, డ్రోన్ వినియోగం పై శిక్షణ తదితర కార్యక్రమాలు పూర్తి చేశామని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. వరదల కారణంగా సంభవించిన పంట నష్టానికి పెట్టుబడి రాయితీ పెంచడమే కాకుండా.. నెలరోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేశామని చెప్పారు.

రానున్న రోజుల్లో వ్యవసాయాన్ని మరింత బలోపేతం చేసేందుకు సాగుదారుల హక్కుల చట్టం-2024, రైతు బృందాలకు డ్రోన్ల సరఫరా, రాయితీపై వ్యక్తిగత పనిముట్లు, బంజరు భూముల్ని సాగులోకి తేవడం, అన్నదాత సుఖీభవ- పిఎం కిసాన్, పంటల బీమా, వడ్డీ లేని పంట రుణాల కార్యక్రమాలను అమలు చేయబోతున్నామని వివరించారు.

నవంబర్ 11 న ఆయన శాసనసభలో 2024-25 సంవత్సరానికి వ్యవసాయ, అనుబంధ శాఖలకు బడ్జెట్ ను ప్రవేశ పెట్టారు.



**తక్షణ సాయం :**

విపత్తుల సమయంలో పంట నష్టానికి ఇచ్చే పెట్టుబడి సాయాన్ని హెక్టారుకు రూ. 17 వేల నుంచి రూ. 25 వేలకు పెంచామని ప్రత్యేక ప్యాకేజీ అమలు చేశామని మంత్రి పేర్కొన్నారు. 21 జిల్లాల్లో పంట నష్టపోయిన 1.90 లక్షల మంది రైతులకు ఈ-పంట ద్వారా 284.56 కోట్లు చెల్లించామని చెప్పారు. జులైలో భారీ వర్షాలు, వరదలతో పంటలు దెబ్బతిన్న 4 జిల్లాల్లోని 23,259 మంది రైతులకు రూ. 25.75 కోట్ల పెట్టుబడి రాయితీని త్వరలో అందిస్తామన్నారు.

**పొలం పిలుస్తోంది:**

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు తలపెట్టిన బృహత్తర కార్యక్రమమే పొలం పిలుస్తోంది. ప్రతి మంగళ, బుధ వారాల్లో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రజా ప్రతినిధులు పొలం బాట పడతారు. రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతిక సమాచార పరిజ్ఞానాన్ని చేరువ చేయడం, వ్యవసాయ అనుబంధ శాఖల పథకాలపై అవగాహన కల్పించడం, క్షేత్రస్థాయి సమస్యలకు తక్షణ పరిష్కారం చూపడం, ఎక్కువ నికరాదాయం దిశగా రైతులను ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశాలు. ఖరీఫ్, రబీ పంట కాలాల్లో నాలుగేసి నెలల పాటు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారు.





## సాంకేతిక దన్ను:

యాప్‌ల ఆధారంగా పంట పొలాల్లో పురుగులు, తెగుళ్ళ ఉధృతిని, పోషక లోపాలను అంచనా వేస్తారు. కృత్రిమ మేధ(ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎం.ఎల్) ప్రక్రియలతో వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు రైతులకు సలహాలు ఇస్తారు.

2024-25 ఏడాదిలో 4.50 లక్షల మట్టి నమూనాలు సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించింది. దీనికి 18.30 కోట్లు కేటాయించారు.



## ఉద్యానం మరింత బలోపేతం:

స్వర్ణాంధ్ర - 2047 లక్ష్యాల్లో భాగంగా 11 ఉద్యాన పంటలను క్లస్టర్ విధానంలో ప్రోత్సహిస్తున్నాం. నాణ్యమైన మొక్కలు పంపిణీ చేసి ఉత్పాదకత, నికర రాబడి పెంచడమే లక్ష్యంగా 2024-25 లో 1.74 లక్షల ఎకరాలను వ్యవసాయ పంటల నుంచి ఉద్యాన పంటల్లోకి తీసుకొస్తాం. బహుళ అంతస్థులు, అంతర పంటలను ప్రోత్సహిస్తాం. రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేస్తాం. ఉద్యాన ఉత్పత్తులను మార్కెట్‌కు అనుసంధానిస్తామని మంత్రి తన బడ్జెట్ ప్రసంగం లో వివరించారు.

ఉద్యాన శాఖ చరిత్రలోనే అత్యధికంగా ఈ బడ్జెట్‌లో రూ. 3,469.47 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. అందులో అధిక భాగం రూ.2700 కోట్లను సూక్ష్మ సేద్యానికే ఖర్చు చేయనున్నారు.

## డ్రోన్ల విప్లవం:

రైతులకు ఈ ఏడాది వ్యక్తిగత యంత్ర పరికరాలు ఇవ్వాలని, డ్రోన్ల వినియోగం పెంచాలని నిర్ణయించింది. వ్యవసాయ యాంత్రీకరణకు రూ.187.68 కోట్లు కేటాయించింది. రూ.87.50 కోట్లతో



875 యంత్ర సేవ కేంద్రాలను ఏర్పాటు చేసి 40% సబ్సిడీ పై డ్రోన్లు ఇవ్వనున్నారు.

## అన్నదాత సుఖీభవ-పి.ఎం కిసాన్ :

కింద ఏడాదికి రూ.20 వేలు ఆర్థిక సాయం ఇచ్చే పథకానికి త్వరలో మార్గదర్శకాలు విడుదల చేయనున్నారు.

### కొత్తగా మామిడి, అరటి, జీడి బోర్డుల ఏర్పాటు

ఆహార శుద్ధి పరిశ్రమల కింద మూడు గిరిజన జిల్లాలను ఆర్గానిక్ జోన్లుగా ప్రకటిస్తున్నాం. మామిడి, అరటి, జీడి బోర్డులను ఏర్పాటు చేస్తాం. కేంద్రం వయబిలిటీ ఫండ్ కింద 20% నిధులు ఇస్తోంది. దీన్ని కూడా అనుసంధానిస్తాం. ఈ విధానం ద్వారా రూ. 30 వేల కోట్ల మేర పెట్టుబడులు ఆకర్షించాలనుకుంటున్నాం. మూడు లక్షల యూనిట్లు లక్ష్యంగా పనిచేస్తున్నాం.

-శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు


### 2024-25లో వ్యవసాయ అనుబంధ రంగాలకు బడ్జెట్ కేటాయింపులు (రూ.కోట్లలో)

| శాఖ | కేటాయింపులు (రూ.లలో) |
|---|---|
| వ్యవసాయం | 8,564.37 |
| ఉద్యానం | 3,469.47 |
| పశుసంవర్ధక | 1,095.71 |
| మత్స్య శాఖ | 521.34 |
| వ్యవసాయ విద్యుత్తు | 7,241.30 |
| పట్టు పరిశ్రమ | 108.44 |
| సహకార | 308.26 |
| వ్యవసాయ మార్కెటింగ్ | 314.80 |




# వాస్తవ సాగుదారులకు మేలు చేసేలా కొత్త కౌలు చట్టం - 2024

- రాష్ట్రంలో **2024-25** ఖరీఫ్ లో సాగైన భూమి **39,17,309** హె.
- **28,05,916** హె.లో వ్యవసాయ పంటలు సాగయ్యాయి.
- రబీలో ఇప్పటి వరకు సాగైన భూమి **1,85,618** హె.
- రాష్ట్రంలో కౌలు రైతులు సుమారు **16,00,682**
  **ఇందులో:** భూమి లేని కౌలు రైతులు,
  భూమి ఉన్న కౌలు రైతులు.


వ్యవసాయ శాఖామాత్యులు
అచ్చెన్నాయుడు

వ్యవసాయంలో కష్టనష్టాలు భరిస్తూ, అందరికీ అన్నం పెడుతున్న వాస్తవ సాగు దారులకు చేయూతనిస్తూ, అదే సమయంలో భూయజమాని హక్కులకు ఎలాంటి నష్టం వాటిల్ల కుండా, వారి హక్కుల రక్షణకు ఏర్పాట్లు చేస్తూ – సాగు చేస్తున్న వాస్తవ సాగు రైతులకు పంట సాగుదారు హక్కు పత్రం జారీ చేయడం జరుగుతున్నది. యజమాని రైతుల భూమి హక్కులను సక్రమంగా కాపాడుతూ కౌలు రైతులకు ప్రభుత్వం అందించే వివిధ ప్రయోజనాలను అందించడానికి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆగస్టు 2019 నుండి ఏపి పంట సాగుదారుల హక్కులచట్టం 2019 అమలులోకి తెచ్చింది.

ప్రతి సంవత్సరం వాస్తవ సాగుదారు హక్కుల కార్డు (సి.సి.ఆర్.సి) జారీకి అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నప్పటికీ, APCCR చట్టం'2019 నిబంధనలు "CCRC జారీకి భూమి యజమాని రాత పూర్వక సమ్మతి తప్పనిసరి" కావడంతో ఇది భూమిపై వారి హక్కుల గురించి భూ యజమానుల్లో అభద్రతను కలిగించింది, అంతే కాకుండా అర్హులైన కౌలురైతులకు CCRCలు జారీ చేయడానికి ఇబ్బందిగా మారింది. కౌలు రైతులకు పంపిణీ చేసిన రుణం చాలా తక్కువగా ఉండడం వల్ల వాస్తవ సాగు దారులకు పంట రుణాలు సరిగా అందక వారి జీవనాధారం కూడా దెబ్బతింటున్న సందర్భాలు అనేకం ఉన్నాయి.

ఈ నేపథ్యంలో భూ యజమానుల్లో ఉన్న భయాన్ని తొలగించి, ఎక్కువ మందికి కౌలు కార్డులు అందించే నిమిత్తం ఆంధ్రప్రదేశ్ సాగుదారుల హక్కుల చట్టం, 2024 రూపకల్పనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తద్వారా కౌలు రైతులకు "పంటపై హక్కులు" మరియు భూమిపై హక్కులు లేవు" అని స్పష్టంగా నిర్వచించడం, తద్వారా భూయజమానులకు భద్రత కల్పించేందుకు కౌలుపై కొత్త

చట్టాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం అభిప్రాయపడింది.

**కొత్త చట్టం ప్రధాన లక్ష్యాలు:** భూయజమాని లేదా పట్టాదారుల హక్కులకు భంగం కలగకుండా ప్రత్యక్ష లేదా పరోక్ష అనుమతితో పంటలు పండించే రైతులకు సాగుదారు హక్కు కార్డును అందించే చట్టం. దీని ద్వారా ప్రభుత్వ ఆర్థిక సంస్థల నుండి పంట రుణాలు పొందేందుకు, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా, నగదు బదిలీ పథకాలు, పంట ఉత్పత్తుల సేకరణ, పంట నష్ట పరిహారం, ఇతర పథకాల ప్రయోజనాలను అందిం చేందుకు వీలు కల్పించడం. వ్యవ సాయ శాఖ పథకాల ప్రయోజ నాలు అర్హులైన సాగుదారులకు చేరేలా చూసేందుకు, దానికి సంబంధించిన విషయాలు, అను సంధానమైన అంశాలకు ఒక వ్యవ స్థను ఏర్పాటు చేయడం.

> గౌరవ ముఖ్యమంత్రి వర్యుల ఆదేశం మేరకు కొత్త కౌలు చట్టం 2024 ముసాయిదా మీద రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ప్రాంతీయ సమావేశాలను నిర్వహించి అన్ని జిల్లాల భూ యజమానులు, కౌలు రైతులు, కౌలు రైతు సంఘాల నుంచి అభిప్రాయాలు, సూచనలను తీసుకోవడం జరిగింది.

**కొత్త కౌలు చట్టం ముసాయిదా లోని ముఖ్యమైన అంశాలు:**

**సాగుదారు హక్కుల కార్డు జారీ:**

(1) చట్టం అమలు ప్రారంభమైన రోజు నుండి, సాగుదారు హక్కు కార్డు అవసరమయ్యే ప్రతి భూమి సాగుదారు, సంబంధిత భూమికి గుర్తింపు పొందిన సాగుదారుల రిజిస్టర్లో తన పేరును నమోదు చేయడానికి సూచించిన విధంగా నిర్దేశిత వ్యవధిలో దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.

(2) సాగుదారు సాగుకోసం తీసుకున్న భూమి వివరాలను ప్రకటిస్తూ నిర్దేశించిన పద్ధతిలో తన సంతకంతో దరఖాస్తు చేసుకోవాలి.

(3) ఒక గ్రామం నుండి స్వీకరించబడిన దరఖాస్తులన్నింటిని నిర్దేశించబడిన ప్రక్రియను అనుసరించి గ్రామసభలో బహిరంగ విచారణ ద్వారా నిర్ణీత సమయం తర్వాత ధృవీకరించడానికి వ్యవసాయ అధికారులు బాధ్యత వహించాలి.

(4) నిర్ణీత ప్రక్రియ ద్వారా ఆమోదించబడిన అర్హతగల దరఖాస్తుల వివరాలు గుర్తింపు పొందిన సాగుదారుల రిజిస్టర్లో ఈ ప్రయోజనం కోసం ప్రత్యేకంగా రూపొందించబడిన IT వ్యవస్థలో నమోదు చేయబడతాయి.

(5) రిజిస్టర్ నమోదు తర్వాత, ప్రతి గుర్తింపు పొందిన సాగు దారుడు మండల వ్యవసాయ అధికారి జారీ చేసే కౌలు హక్కు అర్హత పత్రానికి అర్హులు, వ్యవసాయదారుడు డేటాబేస్ నుండి కౌలు హక్కు పత్రం పొందవచ్చు.

(6) దేవాలయ భూములు, ఎండోమెంట్ భూములు, వక్ఫ్ భూములు లేదా ప్రభుత్వ శాఖలోని ఏదైనా శాఖ లేదా సంస్థకు చెందిన భూములను ప్రత్యక్ష లేదా పరోక్ష అనుమతితో సాగు చేస్తున్న రైతులు, ఈ సెక్షన్ పైన పేర్కొన్న నిబంధనల ప్రకారం సాగుదారు హక్కు అర్హత కార్డును పొందేందుకు అర్హులు. ఎండోమెంట్ & వక్ఫ్ భూములు నిబంధనల ప్రకారం వేలం వేయబడతాయి, కాబట్టి వాస్తవ సాగుదారులకు తదనుగుణంగా సాగుదారు హక్కు అర్హత పత్రాలు జారీ చేయబడతాయి.

(7) కౌలు హక్కు అర్హత పత్రం పొందిన కౌలు రైతుల జాబితా సామాజిక తనిఖీ కోసం గ్రామసభ, సంబంధిత రైతు సేవ కేంద్రాల్లో (RSK) ప్రదర్శిస్తారు.

(8) సాగుదారు అర్హత హక్కు పత్రం జారీ చేసే ప్రక్రియను ప్రతి సంవత్సరం ఏప్రిల్ లో ప్రారంభించి, జూన్ లో పూర్తి చేయాలి.

**సాగుదారు హక్కుల కార్డ్ కింద అర్హత పరిధి:**

(1) ఒక సాగుదారునికి జారీ చేసిన అర్హత హక్కుపత్రం ప్రకారం పండించిన పంటపై హక్కును మాత్రమే కల్పిస్తుంది, అంతే కానీ భూమిపై ఎలాంటి హక్కులు కల్పించదు.

(2) గుర్తింపు పత్రం పొందిన సాగుదారులు పంట రుణాలను ఏదైనా ప్రభుత్వ ఆర్థిక సంస్థ నుండి పొందేందుకు అర్హులు. అంతేగాక పంటల బీమా, ఆర్థిక సహాయం లేదా నగదు బదిలీ పథకాలు, ఇన్‌పుట్ సబ్సిడీతో సహా కౌలు అర్హత పత్రంలో పేర్కొన్న భూమిలో పంట సాగుకు సంబంధించిన ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు, పంట నష్టం, పంట ఉత్పత్తి సేకరణ, ఇతర క్లెయిములు పొందడానికి అర్హులు. కౌలు సాగుదారు హక్కు పత్రం (ఎన్ టైటిల్ మెంట్ కార్డ్), సాగులో ఉన్న భూమిపై ఏ విధమైన స్వాధీన హక్కు కల్పించదు.

(3) ప్రభుత్వ ఆర్థిక సంస్థలు ఎటువంటి రెవెన్యూ రికార్డును సమర్పించమని పట్టుబట్టకుండా కేవలం అర్హత కార్డు సమర్పణ పై మాత్రమే పంట రుణాన్ని మంజూరు చేయవచ్చు.

(4) సాధారణంగా జారీ చేసిన సాగుదారు హక్కు పత్రం ఒక వ్యవసాయ సంవత్సరానికి చెల్లుబాటు అవుతుంది, అయితే దీర్ఘకాలిక పంటల ను వేసుకున్నప్పుడు ఇది పంట కాలానికి జారీ చేయడం లేదా తిరిగి పునరుద్ధరించడం జరుగుతుంది.

(5) సబ్‌సెక్షన్ 3(4)లో ముందుగా వివరించిన విధంగా వ్యవసాయ అధికారి జారీచేసిన సాగుదారు హక్కు పత్రాలు పొందిన రైతుల జాబితాను ప్రభుత్వ ఆర్థిక సంస్థలకు పంట రుణం మంజూరు కోసం అందజేయాలి.

(6) భూ యజమాని లేదా పట్టాదారు, సాగు కోసం భూమిని ఇచ్చినప్పటికీ, ప్రభుత్వ ఆర్థిక సంస్థల నుండి పంట రుణం కాకుండా ఇతర రుణాలు పొందేందుకు ఆ భూమిని భద్రతగా చూపి రుణం తీసుకోడానికి అర్హులు.

# డిసెంబర్ మాసంలో చేపట్టవలసిన వ్యవసాయ పనులు

## వరిలో



డిసెంబర్ మాసానికి సార్వాలో ముందుగా సాగు చేసిన వరి కోతలు పూర్తయి, దాళ్వా వరి నారుమడి దశలో ఉంటాయి. జులై రెండవ పక్షంలో విత్తిన పొలాలు కోత దశలో ఉంటాయి. ఆలస్యంగా నాటిన పొలాలు (పల్నాడు, నంద్యాల జిల్లాలు) గింజ పాలు పోసుకునే దశ నుండి గట్టిపడే దశ లో ఉంటాయి.

**సార్వా వరి కోత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు:** వెన్నులో 80-90% గింజలు పసుపురంగుకు మారుతున్నప్పుడు కఱ్ఱ పచ్చి మీద పంటను కోయాలి. పంట పక్వానికి వచ్చిన తరువాత ఎక్కువ కాలం చేనుమీద ఉంటే దిగుబడి తగ్గడంతో పాటు, గింజలపై పగుళ్ళు ఏర్పడతాయి. గింజలలో తేమ తగ్గించడానికి 4-5 రోజులు చేనుపైనే ఎండనివ్వాలి. పనలను తిరగదిప్పితే సమానంగా ఎండుతాయి. పంటను ముందుగా కోస్తే ధాన్యంలో పచ్చి గింజలు ఎక్కువగా ఉంటాయి. అంతేకాక, కంకిలోని చివరి గింజలు పూర్తిగా నిండుకోక చాలా సన్నంగా పొట్ట తెలుపు కలిగి ఉంటాయి. తద్వారా మిల్లింగ్ చేసినపుడు నిండు గింజల దిగుబడి తగ్గి అధికంగా నూక వస్తుంది.

రైతు పండించే ధాన్యానికి సరైన గిట్టుబాటు ధర రావాలంటే నాణ్యత కలిగిన ధాన్యం శుభ్రంగా, పొడిగా, ఒకే రంగు, ఆకారం ఉండాలి, బూజు, కీటకాలు, సూక్ష్మ జీవులు ఆశించకుండా చెడు వాసన లేకుండా ఉండాలి. కలుపు విత్తనాలు ఉండకూడదు. నూర్పిడి యంత్రాల ద్వారా రెండు వేర్వేరు రకాలు కలవకుండా జాగ్రత్తపడాలి.

**కోత సమయంలో అకాల వర్షాలకు చేను పడిపోతే తీసుకోవాల్సిన జాగ్రత్తలు:** కోత దశలో, గింజ తోడుకునే లేదా గట్టిపడే దశలో అకాల వర్షాల వల్ల మొక్క పడిపోయి నేలకి ఒరిగే అవకాశం ఉంది. దీనితోపాటు పడిపోయిన చేల నుండి వచ్చే ధాన్యం మిల్లింగ్ సమయంలో విరిగిపోయి నూక ఎక్కువ వచ్చే అవకాశం ఉంది. అంతే కాక మిల్లు ఆడించిన బియ్యం మీద మచ్చ రావడానికి కూడా అవకాశం ఉంది. కోత కోసిన పొలంలో ఉన్న పనలు వర్షానికి తడిస్తే నీరు పూర్తిగా బయటకు పోవటానికి కాలువలు చేసుకోవాలి, గింజ మొలకెత్తకుండా ఉండ డానికి 5% ఉప్పు ద్రావణాన్ని పనలపై పడేవిధంగా పిచికారీ చేయాలి.

**దాళ్వా వరి**

దాళ్వా నారుమడులు డిసెంబర్ 15 లోపల స్వల్పకాలిక రకాలతో పోసుకోవాలి అలాగే ఎద పద్ధతిలో సాగు చేసినప్పటికీ 120 రోజులు కాల పరిమితి కలిగిన దాళ్వా వరి రకాలను డిసెంబర్ 31 లోపు విత్తుకోవాలి.

దాళ్వా సాధారణ పరిస్థితుల్లో సాగుచేయడానికి ఎం .టి.యు. 1121 (శ్రీధృతి), ఎం.టి.యు. 1210 (సుజాత), ఎన్.ఎల్.ఆర్. 34449 (నెల్లూరు మసూరి), ఎన్.ఎల్.ఆర్. 3354 (నెల్లూరు ధాన్యరాశి) ఎన్.ఎల్.ఆర్ 40024 (శ్వేత)

**అధిక దిగుబడినిచ్చే రకాలు:**ఎం.టి.యు. 1156 (తరంగిణి), ఎం.టి.యు. 1153 (చంద్ర), ఎం.టి.యు. 1010 (కాటన్ దొర సన్నాలు), ఎం.టి.యు. 1273, ఎం .టి.యు. 1293,

**ఎగుమతికి అనువైన రకాలు:**ఎం.టి.యు. 3626 (ప్రభాత్),

**కేరళ మార్కెట్‌కి అనువైన రకం :** ఎన్.ఎల్.ఆర్ 3238 (హై జింక్ రకం).

**చౌడు భూములలో సాగుకు**ఎం.టి.యు 1293 అనుకూలం.

నారు పీకడానికి వారం రోజుల ముందు ప్రతి సెంటు నారుమడికి 160 గ్రా. కార్బోఫ్యురాన్ 3 జి గుళికలు చల్లడం వల్ల నాటిన 20-25 రోజుల వరకు కాండం తొలుచు పురుగు, ఉల్లికోడు, ఆకు ముడత వంటివి ఆశించకుండా నివారించవచ్చు.

డిసెంబర్ లో చలి వాతావరణానికి జింకు లోపం, అగ్గి తెగులు మరియు కాండం తొలిచే పురుగు ఆశించే అవకాశం ఉంది.



డా. ఎం. గిరిజా రాణి
ప్రధాన శాస్త్రవేత్త,
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం,
మార్టేరు ,
పశ్చిమ గోదావరి జిల్లా.

## ఉద్యాన పంటలు:



**మామిడి :** పూ మొగ్గలను ఉత్తేజపరిచి త్వరగా పూత తెప్పించడానికి, ఆడ పూల శాతం పెంచడానికి పొటాషియం నైట్రేట్ (సురేకారం/మల్టీకే / ఫెర్టిమాక్స్) 10 గ్రా. ఒక లీటరు నీటికి+బోరాన్ 2 గ్రా లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పూ మొగ్గ దశలో తేనెమంచు పురుగు నివారణకు లీటరు నీటికి క్లోరిఫైరిఫాస్ 2.5 మి.లీ కలిపి పూత మొదలయ్యే సమయం, పిందెలు తయారయ్యే సమయంలో పూత, ఆకులపైనే కాకుండా మొదళ్ళపైన, కొమ్మల పైన కూడా పిచికారీ చేయాలి. జీవ శిలీంద్రనాశకాలు అయిన మెటారైజియమ్ లేదా వర్టిసిలీయమ్ ను 5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**అరటి :** తోటల్లో కలుపు లేకుండా శుభ్రంగా ఉంచి, తల్లి చెట్టు చుట్టూ వచ్చే పిలకలను ఎప్పటికప్పుడు కోసివేయాలి. అలాగే అవసరాన్నిబట్టి నీటి తడి ఇవ్వాలి. నులిపురుగులు ఆశించిన ట్లయితే మొక్కకు 25-40 గ్రా కార్బోఫ్యురాన్ గుళికలు మొక్క మొదలు దగ్గర 10 సెం.మీ. లోతులో వేసి మట్టితో కప్పి తేలికపాటి తడి ఇవ్వాలి. తెల్ల చక్కెర కేళి రకానికి నాలుగవ దఫా ఎరువులు వేయాలి.

**నిమ్మ :** సిఫార్సు చేసిన ఎరువులు వేయాలి. వేరుకుళ్ళు రాకుండా మాంకోజెబ్ 25 గ్రా./10 లీటర్లు లేదా కార్బండిజం 2 గ్రా. /లీ లేదా 1% శాతం బోర్డో మిశ్రమం నీళ్ళల్లో కలిపి చెట్ల మొదళ్ళలో పాదంతా తడిచేటట్లు పోసుకోవాలి. వారం పది రోజుల తర్వాత పశువుల ఎరువులో అభివృద్ధి చేసిన ట్రైకోడెర్మాను 10 కిలోలు ప్రతి చెట్టుకు వేసుకుంటే వేసవిలో వేరుకుళ్ళు నుంచి కాపాడ వచ్చు.

**దానిమ్మ:** శిలీంద్రపు మచ్చ తెగులు లక్షణాలు గమనించినట్లయితే మాంకోజెబ్ 2.5 గ్రా /లీ లేదా థయోఫానేట్ మిథైల్ 1 గ్రా./ లీ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**ఉసిరి :** బెరడును ఆశించే పురుగుల నివారణకు పురుగు విసర్జించిన పదార్థాన్ని తీసివేసి కిరోసిన్ నీటికి కలిపి రంధ్రాలలో పోయాలి.

**బొప్పాయి:** మొక్కలు నాటే 15 రోజుల ముందు 40 ×40×40 సెం.మీ గుంతలు తీసుకోవాలి. గుంతల పై మట్టికి 5 కిలోల పశు వుల ఎరువు, కిలో వేప పిండి, 20 గ్రా. అజోస్పైరిల్లమ్, 20 గ్రా. ఫాస్ఫో బ్యాక్టీరియా వేసి బాగా కలిపి గుంత నింపుకోవాలి. 45-60 రోజుల వయసున్న 15 సెం,మీ. పొడవున్న మొక్కల్ని గుంతలో సాయంత్రం పూట నాటుకోవాలి. తోట చుట్టూ మొక్కలు నాటు కోవడానికి 15 రోజుల ముందే రెండు వరసల ఆవిశ/ఆముదం/ మొక్కజొన్న దడి పంటలుగా వేసుకోవడం వల్ల వైరస్ తెగుళ్ళ వ్యాప్తిని తగ్గించవచ్చును. తెల్ల దోమ నివారణకు ఎకరాకు 12 - 15 పసుపు రంగు జిగురు అట్టలను తోటలో అమర్చాలి. నివార ణకు వేపనూనె 2.5 మి.లీ+అసిఫేట్ 2.5 గ్రా. + జిగురు 0.5 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

డ్రిప్ పద్ధతిలో చిన్నమొక్కలకు 2 రోజులకు, ఒక్కో మొక్కకు 8 లీ.పెద్ద మొక్కలకు రోజూ ఒక్కో మొక్కకు 20-25 లీ. నీటిని పెట్టాలి.

**క్యాబేజీ, కాలీఫ్లవర్ :** పంటలను ఆశించే డైమండ్ బ్యాక్ మాత్ నివారణకు వారానికి ఒకసారి చొప్పున ఎన్.పి.వి. వైరస్ ద్రావణం (250 ఎల్.ఇ 200 లీటర్ల నీటికి కలిపి )నాలుగు సార్లు పిచికారీ చేయాలి. ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు నోవాల్యూరాన్ 1 మి.లీ లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ లీటరు నీటికి కలిపి కోతకు 15 రోజుల వ్యవధి ఉండేలా పిచికారీ చేయాలి. ఆవాల పంటను ఆకర్షణ పంటగా క్యాబేజీ, కాలీఫ్లవర్ పంటల్లో వేసుకోవాలి.

రైతుల సలహా కేంద్రం,
డా.వై.ఎస్.ఆర్.ఉద్యాన విశ్వవిద్యాలయం,
వెంకటరామన్న గూడెం, పశ్చిమ గోదావరి



# రబీ మొక్కజొన్నలో ఎరువుల యాజమాన్యం

మొక్కజొన్నను వరి మాగాణుల్లో నవంబర్ నుండి జనవరి వరకు విత్తుకోవచ్చు. మొక్కకు సరైన సమయంలో సరైన మోతాదులో ఎరువు అందించటమే తెలివైన పద్ధతి. కండె నిండా గింజలుండాలంటే తొలి దశలో మొక్కజొన్నలో నత్రజని లోపం లేకుండా చూడాలి. వేరు వ్యవస్థ సరిగా అభివృద్ధి చెంది మంచి నాణ్యమైన కండె కావాలంటే సిఫార్సు చేసిన మోతాదులో దుక్కిలో భాస్వరం వేయటం కూడా అత్యంత ఆవశ్యకం. మొక్క జొన్నలో కణుపుల మధ్య దూరం తగ్గకుండా బలమైన కాండం కోసం పొటాష్ ఎరువు తప్పకుండా వేయాలి. జింక్ లోపం అలానే ఇనుము లోపం లేకుండా చూసుకుంటూ మంచి దిగుబడి సాధించాలి.సూక్ష్మ పోషకాలు తక్కువ పరిమాణంలో అవసరమైనప్పటికి వీటి ప్రాధాన్యం తక్కువ కాదు. ఏ ఒక్క పోషక లోపం ఉన్నప్పటికీ దాని ప్రభావం దిగుబడి మీద ఖచ్చితంగా ఉంటుంది.

- పంట వేసుకునే ముందు భూసార పరీక్ష చేసుకొని ఆ ఫలితాల అధారంగా ఎరువుల మోతాదును పెంచుకోవడం లేదా తగ్గించుకోవడం చేయాలి.
- అవసరానికి మించి ఎరువులు వాడటం వల్ల పోషకాలని వృధా చేయడమే కాకుండా అనవసరంగా ఖర్చు పెరగడం, పోషకాల సమతుల్యత లోపించడం, దిగుబడి తగ్గడం, నేల ఆరోగ్యం క్షీణించడం జరుగుతుంది.
- కావున రైతులు అవసరమైన మేరకే ఎరువులను వేయాలి. వేసిన ఎరువులు సమర్థవంతంగా మొక్క తీసుకు నేటట్లు చేయడం ద్వారా ఎరువు ఖర్చు తగ్గించుకొని, ఎరువుల వినియోగ సామర్థ్యాన్ని పెంచుకోవచ్చు.
- మొక్కలకు అవసరమైన పోషకాలు సకాలంలో లభ్యమైనప్పుడే మొక్కలు బాగా పెరిగి అధిక దిగుబడినిస్తాయి.
- రబీలో మొక్కజొన్న పంట ఎరువులను ఎక్కువగా సద్విని యోగం చేసుకుంటుంది.
- రైతులు పంటలో కనిపించిన పోషక లోపాల్ని గుర్తించి వెంటనే సవరణ చర్యలు చేపట్టినట్లైతే ఆ పోషక లోపం ద్వారా కలిగే నష్టాన్ని నివారించుకోవచ్చును.



**నత్రజని లోప లక్షణాలు:**

- మొక్కజొన్న పంట తొలి దశలో నత్రజని లోపం ఏర్పడితే, మొదట క్రింద ఆకులు పసుపు పచ్చగా మారి క్రమ క్రమంగా మొక్క మొత్తం పాలిపోయి పసుపుపచ్చ రంగులోకి మారుతుంది.
- కాండము సన్నగా, పొడవుగా మారి మొక్కలు బలహీన పడతాయి
- ఆకు కొనల నుండి తిరగబడిన 'V' ఆకారంలో పసుపు వర్ణంలోకి మారును. నత్రజని లోపం ఎక్కువ కాలం కొనసాగితే కింద ఉన్న ముదరు ఆకులు మొత్తం పసుపు రంగుకు మారి మొక్క ఎండిపోతుంది.
- కండెలు మరియు గింజలు చిన్నవిగా తయారై, కండె చివరి భాగంలో గింజలు ఏర్పడవు.

**సవరణ :**

- పంట పెరుగుదల దశల్లో అవసరమయ్యే మోతాదు నేలలో తేమ లభ్యతనుబట్టి పైపాటుగా వేయవలసిన నత్రజని ఎరువులను తప్పనిసరిగా వేసుకోవాలి.
- బెట్ట పరిస్థితుల్లో 2 శాతం యూరియా ద్రావణం పిచికారి చేయాలి.



## భాస్వరం లోప లక్షణాలు :

- మొక్కజొన్నలో భాస్వరం లోపం సాధారణంగా చిన్న మొక్కల్లో కనిపిస్తుంది.
- వాతావరణం బాగా చల్లగా ఉన్నప్పుడు. భాస్వరం లోపం పంటపై కనిపిస్తుంది.
- ముదురు ఆకులు ఎరుపుతో కూడిన నీలి రంగులోకి (వంకాయ రంగు) మారుతాయి.
- భాస్వరం లోపం ఉన్నప్పుడు వేరు వ్యవస్థ సరిగా అభివృద్ధి చెందక మొక్కలు చిన్నవిగా ఉండి నెమ్మదిగా పెరుగుతాయి.
- భాస్వర లోపం పరపరాగ సంపర్క దశ వరకు కొనసాగితే పీచు సరిగా బయటకు రాకపోవడంతో విత్తనం లేని లేదా అభివృద్ధి చెందని గింజలతో వంకర టింకరగా ఉన్న చిన్న కండెలు ఏర్పడతాయి.

### సవరణ:

- ◆ భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా సిఫారసు చేయబడిన మోతాదును దుక్కిలో వేసి కలియదున్నడం వల్ల ఈ లోపం రాకుండా కాపాడవచ్చు.
- ◆ భాస్వర లోపాన్ని పంట మధ్య కాలంలో గమనించినప్పుడు అవసరాన్ని బట్టి అమ్మోనియం ఫాస్పేట్ వంటి నీటిలో కరిగే ఎరువులను నీటి తడులతోపాటు అందించి ఈ పోషక లోపాన్ని తగ్గించవచ్చు.

## జింక్ లోప లక్షణాలు:

- □ మొక్కజొన్న పంట దిగుబడిలో జింకు పాత్ర గణనీయంగా ఉంటుంది.
- □ వాతావరణం బాగా చల్లగా ఉన్నప్పుడు, మోతాదుకు మించి అధికంగా భాస్వరం పైరుకు అందించినప్పుడు జింకు లోపం కనిపిస్తుంది.
- □ పైరు 20-25 రోజుల దశలో (5 లేదా 6 ఆకుల దశలో) మొక్కల్లో పై నుంచి రెండు లేదా మూడో ఆకు మొదలు భాగంలో లోప లక్షణాలు కనిపిస్తాయి.
- □ ఆకుల ఈనెల మధ్య భాగంలో పాలిపోయిన పసుపు తెలుపు రంగు చారలు ఏర్పడతాయి. సాధారణంగా ఆకుల చివర్ల మధ్య ఈనె ప్రాంతం ఆకుపచ్చగా ఉంటుంది.
- □ కణుపుల మధ్య దూరం తగ్గిపోవడం వల్ల మొక్కలు చిన్నవిగా మారుతాయి.

### సవరణ

- ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ ని మూడు పంటల కొకసారి దుక్కిలో వేయాలి.
- మొక్కలపై లోప తీవ్రత గమనించినప్పుడు 2 గ్రాముల జింక్ సల్ఫేట్ ఒక లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో 2-3 సార్లు పిచికారీ చేసి జింకు లోపాన్ని నివారించవచ్చును.

## పొటాషియం లోప లక్షణాలు :

- ■ పొటాషియం లోప లక్షణాలు మొక్కల కింది ఆకులలో మొదలై ఆకు అంచులు పసుపు మరియు గోధుమ రంగులోకి మారి క్రమంగా ఎండిపోతాయి.
- ■ లక్షణాలు మొక్క పై భాగంకు వ్యాపిస్తాయి. లేత ఆకులు మాత్రం ఆకుపచ్చ రంగులో కనిపిస్తాయి.
- ■ కాండాన్ని కణుపుల వద్ద తుంచి చూస్తే ముదురు గోధుమ రంగులో కనిపిస్తుంది.
- ■ చివర్లలో గింజ కట్టని కండెలు ఏర్పడతాయి.

### సవరణ

- □ పైరుకు సిఫారసు మేరకు భూసార పరీక్షలను అనుసరించి పొటాషియంను అందించాలి.
- □ పొటాషియం నైట్రేట్ 10 గ్రా. లీటరు నీటికి కలిపి 2 నుంచి 3 సార్లు 4 నుంచి 5 రోజుల వ్యవధితో పిచికారీ చేయాలి.
- □ పంట కీలక దశలో దఫాలుగా విభజించి వేయడం వల్ల లోపాన్ని నివారించవచ్చు. (ముఖ్యంగా తేలికపాటి నేలల్లో).

## ఇనుము లోప లక్షణాలు

- ◆ మొక్కజొన్నలో ఇనుపధాతువు లోపం ఏర్పడినప్పుడు పైన ఉన్న లేత ఆకుల ఈనెల మధ్య భాగం (ఆకు మొదలు నుండి చివరి వరకు) లేత పసుపు లేదా తెల్లగా మారుతుంది. తదుపరి ఆకంతా తెల్లని కాగితంలా మారుతుంది.
- ◆ ఇనుము ముదురు ఆకుల నుంచి లేత ఆకులకు సరఫరా కాదు. కాబట్టి మొదట లోపం లేత ఆకులలో కనిపించి ఆ తరువాత లోప తీవ్రతను బట్టి క్రింది ఆకులకు నష్టం కలిగిస్తుంది.

### సవరణ:

- ■ అన్నభేది 5 గ్రా. నిమ్మ ఉప్పు 1 గ్రా. లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.



డా. వి. సుజాత,
శాస్త్రవేత్త,
వ్యవసాయ పరిశోధనా స్థానం, పెద్దాపురం
కాకినాడ జిల్లా.



# పత్తి తీత, అనంతర జాగ్రత్తలు




**ఆంధ్రప్రదేశ్ లో పండించే వాణిజ్య పంటల్లో పత్తి చాలా ప్రధానమైంది. నాణ్యమైన పత్తిని, తద్వారా అధిక ధరను పొందాలంటే రైతులు పత్తి తీసేటప్పుడు, పత్తి తీసిన తర్వాత సరైన శాస్త్రీయ పద్ధతులను పాటించాలి. మనుషుల ద్వారానే పత్తి తీయటం అనేది మెరుగైన పురాతన పద్ధతి. ఇదే నాణ్యమైన పత్తి సేకరణలో సరైన పద్ధతి.**

పత్తి విత్తనం నాటినప్పటి నుండి, పంట చేతికి వచ్చే వరకు జరిగే ప్రక్రియలన్నిటిలోను, పత్తి తీత అనేది ఎక్కువ ఖర్చుతో కూడుకున్న ప్రక్రియ. మన దేశంలో అన్ని ప్రాంతాలలో పత్తి తీత మనుషుల ద్వారా మాత్రమే జరుగుతుంది. మనం తీసిన పత్తిలో వ్యర్థ పదార్థాల సమస్య ఉండదు. పత్తి తీసే సమయం నుంచే తగు జాగ్రత్తలు పాటించడం ద్వారా, ఎటువంటి వ్యర్థ పదార్థాలు లేకుండా నాణ్యతతో కూడిన పత్తిని పొందవచ్చు.

## పత్తి తీసేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు

- పత్తిని మూడు లేదా అంతకంటే ఎక్కువ సార్లు తీస్తారు. ఎన్ని సార్లు తీయవచ్చనే విషయం మనం వేసిన విత్తనం రకం, దాని కాలపరిమితి, వాతావరణం, పాటించిన యాజమాన్య పద్ధతుల మీద ఆధారపడి ఉంటుంది.
- దేశీయ పత్తి తప్ప మిగతా అన్నిటిలో కూడా మొదటి, చివరి తీతలతో పోలిస్తే , మధ్య తీతల్లో పత్తి ఎక్కువగా లభిస్తుంది. అలాగే నాణ్యతా పరంగా బాగుంటుంది.
- పత్తి తీయడం మెల్లగా చేసే పని. దేశవాళీ రకాలలో ఇంకొంచెం కష్టం. ఎందుకంటే వాటిలో పత్తి కాయ పరిమాణం చిన్నగా ఉండి, చదరపు మీటరుకు ఎక్కువ కాయలతో తీత కష్టంగా ఉంటుంది.
- అజాగ్రత్తగా పత్తి తీయడం, కుప్పలుగా వేయడం లాంటి పనుల వల్ల పత్తి మురికిగా తయారై, తక్కువ ధర పలుకుతుంది.
- పత్తికాయలు పూర్తిగా పక్వానికి వచ్చిన తరువాతే పత్తిని తీయాలి పత్తికాయలు మంచులో తడిచినప్పుడు వర్షం పడినప్పుడు పత్తి తీయకూడదు.
- పూర్తిగా విచ్చుకున్న కాయల నుంచి మాత్రమే పత్తిని తీయాలి. సగం విచ్చుకున్న, పక్వానికి రాని కాయల నుంచి పత్తిని తీయరాదు.
- పత్తిని ఎప్పుడూ గుడ్డ సంచుల్లో, జూట్ సంచుల్లో తీసి వాటిని రవాణాకు ఉపయోగించాలి.
- పత్తి రైతులు సాధారణంగా పత్తిని తీయడానికి, రవాణాకు, ఖాళీ ఎరువుల సంచులు ఉపయోగిస్తారు. వీటి నుంచి దారాలు విడిపోయి అవి పత్తిలో కలిసిపోయి, స్పిన్నింగ్ మిల్లులో చాలా





సమస్యలు తెచ్చిపెడతాయి. అందుకనే వాటిని వాడకూడదు. పత్తి తీసేటప్పుడు మొక్క కింది భాగంలో ఉన్న కాయల నుంచి ముందు పత్తి తీయాలి. ఎందుకంటే పై కాయల నుంచి ముందుగా తీస్తే తీసేటప్పుడు వ్యర్థ పదార్థాలు, ఎండిన ఆకు భాగాలు కింద ఉన్న కాయల మీద పడతాయి.

♦ పత్తిలో దుమ్ము, ధూళి, ఎరువులు, పురుగు మందులు, పెట్రోలియం పదార్థాలు కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పత్తి కాయల్లోని గుబ్బల్లోంచి చేతి వేళ్ళతో పత్తి తీసేటప్పుడు ఎండిపోయిన ఆకుల ముక్కలు, కాయ భాగాలు, పూల రెక్కలు కలవకుండా జాగ్రత్త పడాలి.

♦ వర్షం వల్ల, పురుగులు లేదా తెగుళ్ళు ఆశించిన పత్తిని వేరుగా తీయాలి. దీనిని మంచి పత్తితో కలపకూడదు.

♦ వీలైనంతవరకు ఎటువంటి ఆకులు, పూల రెక్కలు, కాండం ముక్కలు లేకుండా శుభ్రంగా ఉంచాలి.

♦ కాయలు విచ్చుకున్న తర్వాత పత్తి తీసుకోవాలి తప్ప, కాయలను పగులకొట్టి తీయడం లాంటివి చేయకూడదు.

♦ సగం విచ్చుకున్న కాయలను సేకరించి, ఎండబెట్టి, వాటి నుంచి పత్తి తీయకూడదు.

♦ వీలైనంతవరకు మధ్యాహ్న సమయంలో ఎండగా ఉన్నప్పుడు పత్తి తీయకూడదు. ఎందుకంటే ఆ సమయంలో ఎండుటాకులు, వ్యర్థపదార్థాలు పత్తిలో కలుస్తాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో, వాతావరణం చల్లగా ఉన్నప్పుడు మాత్రమే, పత్తిని తీసుకోవాలి.

♦ పత్తి తీసేటప్పుడు అవి పొడిగా ఉండాలి. మంచు పడినప్పుడు తేమ ఆవిరి అయ్యేంతవరకు ఉండి, ఆ తరువాత పత్తిని తీసుకోవాలి. ఒక వేళ వర్షం పడితే ఆరిన తర్వాత మాత్రమే పత్తి తీత మొదలు పెట్టాలి.

♦ పత్తి తీసేటప్పుడు పూర్తిగా విచ్చుకున్న, ఆరోగ్యంగా ఉన్న కాయల నుంచి తీసిన పత్తిని, పురుగులు, తెగుళ్ళు ఆశించిన కాయల నుంచి, పక్వానికి రాని కాయల నుంచి తీసిన పత్తిని వేర్వేరు సంచుల్లో సేకరించుకోవాలి. మనం పత్తిని అమ్మేటప్పుడు, జిన్నింగ్ చేసుకునేటప్పుడు గుడ్డి పత్తి, మంచి పత్తితో కలిపినట్లయితే నాణ్యత కోల్పోయి పత్తికి రావాల్సిన ధర రాదు.

**రాష్ట్రంలో పండించిన పత్తి లో అధిక మొత్తం మన రాష్ట్రంలోనే ఉపయోగించేలా వస్త్ర పరిశ్రమను అబివృద్ధి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం.**

♦ చివరిలో తీసే పత్తి నాసిరకంగా ఉంటుంది. కాబట్టి దాన్ని ప్రత్యేకంగా ఉంచి అమ్ముకోవాలి. పంట చివరి దశకు మొక్కలోను, నేలలోను పోషక పదార్థాలు తగ్గిపోవడంతో పత్తిలో నాణ్యత లోపిస్తుంది.

♦ తేమగా ఉన్న పత్తిని ఎట్టి పరిస్థితులలోను తీయకూడదు. ఒక వేళ తీసినా నిల్వ చేయకూడదు. పత్తిలో తేమ 12% కంటే ఎక్కువగా ఉన్నట్లయితే వేడి పెరిగి, విత్తనాన్ని, దూదిని కూడా పాడు చేస్తుంది.

♦ పత్తి తీసేటప్పుడు, తీసిన పత్తిని అంతా ఒక టార్పాలిన్ పట్టా మీద కానీ, గోనె పట్టామీద కానీ పొలంలో ఒక మూలగా కప్పి వేయాలి. ఎట్టి పరిస్థితులలోను దుమ్ము, ధూళి కలవకుండా చూడాలి.

♦ పత్తి తీసిన తరువాత నీడలో ఆర బెట్టాలి. ఇలా చేయడం వలన పత్తి గింజ బాగా గట్టిపడి, తేమ తగ్గి పత్తి శుభ్రంగా ఉంటుంది. అలా చేయనట్లైతే దానిలో ఉన్న తేమ వలన వేడి ఎక్కువై గింజలు ముడుచుకు పోయి పత్తి తూకం తగ్గి, ముక్కు పురుగు పట్టి నాణ్యత తగ్గుతుంది. ఎండలో ఆరబెడితే పత్తి పసుపురంగుకు మారి నాణ్యత తగ్గుతుంది. పత్తిని వీలైనంత వరకు గదుల్లో, షెడ్‌లలో, ఎత్తయిన అరుగుల మీద, సిమెంట్ చేసిన నేల మీద పరవాలి.

♦ పూర్తిగా ఆరిపోయిన తరువాత పొడిగా ఉన్న ప్రదేశాల్లో కుప్ప వేసి, కప్పివేయాలి.



డా.యస్.రాజమణి,
ప్రధానశాస్త్రవేత్త,
వ్యవసాయ పరిశోధనాస్థానం,
లామ్, గుంటూరు.



# కందిలో సస్యరక్షణ



కందిలో ఆశించిన నాణ్యమైన దిగుబడికి సరైన సమయంలో సస్యరక్షణ అనేది ముఖ్యం.
వేసవి లోతుదుక్కులు వలన భూమిలోని పురుగు కోశస్థ దశలు బయట పడి, పక్షులు ఏరుకు తినడానికి వీలవుతుంది.
కాయ తొలిచే పురుగు తక్కువగా ఆశించే పంటలైన జొన్న, సోయాచిక్కుడు, నువ్వులు, ఉలవ లతో పంట మార్పిడి చేయాలి.
అంతర పంటగా ఖరీఫ్ లో 7 సాళ్ళు, రబీలో 3 సాళ్ళు పెసర/ మినుము వేసుకుంటే పరాన్నజీవులను వృద్ధి చేయడానికి తోడ్పడతాయి. పొలం చుట్టూ 4 సాళ్ళ జొన్న రక్షిత పంటగా వేయాలి.
పచ్చ పురుగు తట్టుకునే ఐ.సి.పి.ఎల్. 332, ఎల్.ఆర్.జి. 41 రకాలను లేదా పురుగు ఆశించినప్పటికీ తిరిగి పూతకు రాగల 150 రోజుల స్వల్ప కాలిక రకం పి.ఆర్.జి. 176 ను అధికం గా సాగు చేస్తున్నారు.
పైరు విత్తిన 90 నుంచి 100 రోజుల్లో చిగుళ్ళను ఒక అడుగు మేరకు కత్తిరించాలి.
విత్తన శుద్ధి థైరాం 3 గ్రా ఒక కేజీకి 10గ్రా. ట్రైకోడెర్మా విరిడి తో గాని చేయటం తెగుళ్ళ నుండి బయట పడటానికి సరైన మార్గం.

ఖరీఫ్ పంట కాలంలో జూన్ రెండవ పక్షంలో విత్తిన కంది మొగ్గ దశలోనూ, జులై నెలలో వేసిన కంది పూమొగ్గ దశలోనూ ఉంది. ప్రస్తుత ప్రతికూల పరిస్థితుల కారణంగా పలు రకాల చీడపీడలు ఆశించి నష్ట పరిచే అవకాశం ఉంది. కాబట్టి సకాలంలో సరైన సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు సాధించవచ్చు..

**ఆకుచుట్టు పురుగు:** కంది పెరిగే దశలో ఆకుచుట్టు (గూడు) పురుగు ఆశిస్తుంది. కందితో పాటు ఇతర అపరాలను కూడా ఈ పురుగు ఆశిస్తుంది. చెట్టు పూత దశకు వచ్చేసరికి పువ్వులను, లేత కాయలను తొలిచి తింటుంది. పూత కాయదశల్లో మారుకా మచ్చల పురుగు ఏ విధంగా పంటను దెబ్బతీస్తుందో అదే విధంగా పంటను దెబ్బ తీస్తుంది.







**శనగపచ్చ పురుగు / కాయతొలిచే పురుగు:** కంది పంటలో అపార నష్టం కలిగిస్తుంది. సెప్టెంబర్ నుంచి మార్చి వరకు తీవ్రంగా ఉంటుంది. పొద్దుతిరుగుడు, టమాట, మిర్చి, పొగాకు, పెసర, మినుము పంటలను కూడా ఆశిస్తుంది. పురుగులు ఆకుల పత్ర హరితాన్ని, పూమొగ్గల రేకుల్ని గీకి తింటాయి. తరువాత మొగ్గలు, పూలు, కాయలని తొలిచి నష్ట పరుస్తాయి. కాయల లోపల తలను ఉంచి మిగతా శరీరాన్ని బయటే ఉంచి లోపలి గింజలను తిని డొల్ల చేస్తాయి. ఒకే పురుగు చాలా కాయలకు నష్టం చేస్తుంది. పురుగు ఆశించిన కాయకు ప్రతి కణుపునకు గుండ్రని రంధ్రాలు ఉంటాయి.


**సమగ్ర సస్యరక్షణ:**

- వేసవిలో లోతుదుక్కి చేస్తే భూమిలోని పురుగు కోశ స్థదశలు బయట పడి, పక్షులు ఏరుకు తినడానికి వీలవుతుంది.
- ఈ పురుగు తక్కువగా ఆశించే పంటలైన జొన్న,









సోయాచిక్కుడు, నువ్వులు, ఉలవ, మెట్ట వరి వంటి పంటలతో పంట మార్పిడి చేయాలి.

- ఖరీఫ్ లో అంతర పంటగా 7 సాళ్ళు, రబీలో 3 సాళ్ళు పెసర/మినుము వేసుకుంటే పరాన్న జీవులను వృద్ధి చేయడానికి తోడ్పడతాయి. పొలం చుట్టూ 4 సాళ్ళ జొన్న రక్షిత పంటగా వేయాలి.
- పచ్చ పురుగు తట్టుకునే ఐ.సి.పి.ఎల్. 332, ఎల్.ఆర్.జి. 41 రకాలను లేదా పురుగు ఆశించినప్పటికీ తిరిగి పూతకు రాగల ఎల్.ఆర్.జి. 30, ఎల్.ఆర్.జి. 38 రకాలను సాగు చేసుకోవాలి.
- పైరు విత్తిన 90 నుంచి 100 రోజుల్లో చిగుళ్ళను ఒక అడుగు మేరకు కత్తిరించాలి.
- ఎకరాకు 4 లింగాకర్షక బుట్టలు అమర్చి, పురుగు ఉనికిని గమనించి, తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.
- పురుగులను తినే పక్షులను ఆకర్షించడానికి వీలుగా ఎకరాకు 20 పక్షి స్థావరాలను ఏర్పాటు చేసుకోవాలి.
- పురుగు గుడ్లను, తొలి దశ పురుగులను గమనించిన వెంటనే 5% వేప గింజల కషాయాన్ని లేదా వేప సంబంధమైన మందు (అజాడిరక్టిన్ ) లను పిచికారీ చేయాలి.
- ఎకరాకు200 లార్వాలకు సమానమైన ఎన్.పి.వి. ద్రావణాన్ని లేదా 400 గ్రాముల బ్యాక్టీరియా సంబంధమైన మందును 200 లీటర్ల నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు సాయంత్రం వేళల్లో పిచికారీ చేయాలి.
- బాగా ఎదిగిన పురుగులను ఏరి వేయాలి. లేదా చెట్లను బాగా కుదిపి దుప్పట్లలో పడిన పురుగులను నాశనం చేయాలి.
- రసాయనిక పురుగు మందులను విచక్షణా రహితంగా వాడకూడదు.
- తప్పనిసరైతే పురుగు ఉధృతిని బట్టి పైరు మొగ్గ/తొలి పూతదశలో ఉన్నప్పుడు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. పూత లేదా కాయ దశలో క్వినాల్ఫాస్ 2 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా డెల్టా మెత్రిన్ 0.9 మి.లీ. లేదా ల్యుఫెన్యురాన్ 1 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఈ మందులు వాడిన తరువాత కూడా శనగ పచ్చ పురుగు నివారణ కాకపోతే ఇండాక్సాకార్బ్ 1 మి.లీ. లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ. ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

### కాయతొలిచే మచ్చలపురుగు / మారుకా మచ్చల పురుగు :

కంది. మినుము, పెసర, అలసంద లకు నష్టం కలుగజేస్తుంది. దీనిని వాడుకలో పూతపురుగు లేదా గూడుపురుగు బూజు పురుగు అనికూడా అంటారు. పురుగుకు సంబంధించిన ఒకటి, రెండు దశలు పూమొగ్గల లోపలే ఉండి తినేస్తాయి. తరువాత దశలో లేత ఆకులు పూత, లేత పిందెలను, కాయలను





కలిపి గూడుగా చేసుకొని కాయ అడుగు భాగాన చిన్న రంధ్రం చేసి, లోపలికి వెళ్లి కాయలోని గింజలను తినేసి వాటిని డొల్ల చేస్తుంది. నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా ఎసిఫేట్ 1 గ్రా. లేదా థయోడికార్బ్ 1 గ్రా. లేదా నొవాల్యురాన్ 1.0 మి.లీ. లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ. లేదా ల్యామ్డా సైహ లోత్రిన్ 1 మి.లీ. లేదా ఫ్లూబెండమైడ్ 0.2 మి.లీ. లేదా ఎమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి మందులు మార్చి మార్చి వారం రోజులకు ఒకసారి పిచికారీ చేయాలి.



**డా. ఎల్. మాధవీలత**
ప్రధాన శాస్త్రవేత్త
వ్యవసాయ పరిశోధనా స్థానం,
అనంతపురం..

# రబీ పంటల్లో కలుపు నివారణ



రబీలో వేసే అన్ని పంటల్లో కలుపు అనేది ప్రధాన సమస్య ముందు జాగ్రత్తగా ఏ పంటకు సిఫార్సు చేసిన కలుపు మందులను ఆ పంటలోనే వాడాలి. గడ్డి జాతి, వెడల్పాటి ఆకులు గల కలుపు నివారణకు వేరు వేరుగా కానీ ఒక్కోసారి రెంటికీ సరిపడా సిఫార్సు చేయబడిన మందును నిర్ధారించిన మోతాదులో వాడితే అధిక దిగుబడులు సాధించడానికి అవకాశం ఉంది.

నేలలో తేమ వున్నప్పుడే కలుపు మందు వాడటం ముఖ్యం.

కేవలం కలుపు మొక్కల ద్వారా 30 నుంచి 50 శాతం వరకు పంట నష్టం జరుగుతుంది.

ఒక్కొక్కసారి ఈ కలుపు మొక్కల వలన 100 శాతం నష్టం రావడానికి కూడా అవకాశం ఉంది.

వివిధ పంటల్లో కలుపు మొక్కలను సమూలంగా నివారించలేక పోవడం వల్ల ఈ కలుపు మొక్కల విత్తనాలు భూమిలో రాలి, రబీ పంటల్లో ప్రధాన సమస్యగా మారడానికి అవకాశం ఉంది. సుస్థిరమైన దిగుబడులు పొందడానికి సమగ్ర పోషక యాజమాన్యం తో పాటు సమగ్ర కలుపు నివారణ కూడా చేపట్టాలి. రబీలో ప్రధానంగా వరి, వేరుశనగ, శనగ,మొక్కజొన్న, మినుము, పెసర పంటల్లో దుక్కి తయారీ నుండి సమగ్ర కలుపు యాజమాన్యం పాటించడం ద్వారా పంట సున్నిత దశల్లో కలుపు వల్ల పోటీ లేకుండా చేసి అధిక దిగుబడులు సాధించడానికి అవకాశం ఉంది.

**వరిలో కలుపు యాజమాన్యం :**

మెట్ట నారుమళ్ళలో విత్తిన 1-2 రోజులలోపు : పెండిమిథాలిన్ 30% ఇ.సి. 5 మి.లీ/ లీటరు నీరు 1లీ./ఎకరం.

దంప నారుమళ్ళలో విత్తిన 3-5 రోజులలోపు : పైరజోసల్ఫ్యూరాన్ ఇథైల్ 10% డబ్ల్యు .పి. 80 గ్రా. / ఎకరానికి 20 కిలోల పొడి ఇసుకలో కలిపి చల్లాలి.

విత్తిన 15-20 రోజులకు గడ్డి, వెడల్పాకు కలుపు : బిస్ పైరిబాక్ సోడియం 10 % ఎస్.ఎల్. 1.లీ./ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

**మాగాణి వరిలో కలుపు యాజమాన్యం :**

నాట్లు వేసిన 3-5 రోజులలోపు పొలంలో పలుచగా నీరు పెట్టి 20 కిలోల పొడి ఇసుకలో ఎకరాకు 80 గ్రా. పైరజో సల్ఫ్యూరాన్ ఇథైల్ 10% పొడి మందు కలిపి పొలంలో సమానంగా చల్లాలి. గడ్డి, తుంగ, వెడల్పాటి ఆకులున్న కలుపు మొక్కల నివారణకు నాటిన 3-5 రోజులలోపు పొలంలో పలుచగా నీరు పెట్టి 20 కిలోల ఇసుకలో నాలుగు కిలోల బెన్ సల్ఫ్యూరాన్ మిథైల్ 0.6% + ప్రిటిలాక్లోర్ 6.0% గుళికలు ఎకరం పొలంలో సమానంగా పడేలా వెదజల్లుకోవాలి.

**మాగాణి వరిలో నాటిన 20 రోజులకు వాడతగిన కలుపు మందులు :**

నాటిన 25-30 రోజుల మధ్య మాగాణి వరిలో వెడల్పాటి కలుపు మొక్కలు ఉన్నట్లయితే ఎకరానికి 400 గ్రా. 2,4 డి. సోడియం సాల్ట్ 80% పొడి లేదా 2,4 డి. అమైన్ సాల్ట్ 58% ఎ.సి. 400 మి.లీ. లేదా ఇథాక్సీ సల్ఫ్యూ రాన్ 15% డబ్లు. పి. 50 గ్రా. లేదా మెటా సల్ఫ్యూరాన్ మిథైల్ + క్లోరో మ్యురాన్ ఇథైల్ 8.0 గ్రా,. మందును ఒక ఎకరాకు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

## వేరుశనగలో కలుపు నివారణ :

వేరుశనగ విత్తిన వెంటనే లేదా 1-2 రోజులలోపు ఎకరానికి ఒక లీటరు పెండిమిథాలిన్30% ద్రావణం 200 లీటర్ల నీటిలో కలిపి నేలపై పిచికారీ చేయాలి.

విత్తిన 20-25 రోజులప్పుడు గొర్రుతో అంతర కృషి చేసి మొక్కల మొదళ్లకు మట్టిని ఎగదోస్తే కలుపు నిర్మూలనతో పాటు ఊడలు భూమిలోకి దిగి బాగా ఊరతాయి.

## శనగలో కలుపు యాజమాన్యం :

విత్తిన 24 గంటల లోపు పెండిమిథాలిన్ 1-1.2 లీ. చొప్పున పిచికారీచేస్తే కలుపును పంట తొలి దశలో సమర్థవంతంగా నివారించవచ్చు. పైరు విత్తిన 30 రోజుల వరకు పొలంలో కలుపు లేకుండా చూసుకోవాలి. గొర్రుతో అంతర కృషి చేసి, అవసరమైతే కూలీలతో కలుపు తీయించాలి.

## మొక్కజొన్నలో కలుపు యాజమాన్యం :

పంట విత్తిన తరువాత రెండు, మూడు రోజులలోపు అట్రాజిన్ కలుపు మందును తేలిక నేలల్లో ఎకరాకు 1 కేజి. బరువు నేలల్లో అయితే ఎకరాకు 1200 గ్రాములను 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన నేలపైతగినంత తేమ ఉన్నప్పుడు పిచికారీ చేయడం వల్ల వెడల్పాటి, కొన్ని గడ్డిజాతి కలుపు మొక్కలను దాదాపు ఒక నెల వరకు అదుపు చేయవచ్చు.

15-18 రోజుల పంట లేదా కలుపు 4 ఆకుల దశలో ఉన్న సాధారణ, జీరో టిల్లేజ్ మొక్కజొన్న పంటలో వెడల్పాటి కలుపు, గడ్డిజాతి కలుపును నివారించడానికి టెంబో ట్రయోన్ 34.4% ఎస్.సి. 115 మి.లీ. + అట్రాజిన్ 50% డబ్ల్యు.పి. 400 గ్రా. మందును ఎకరానికి పిచికారీ చేయాలి.

తుంగ ఎక్కువగా ఉంటే హాలో సల్ఫ్యూరాన్ మిథైల్ 40 గ్రా./ ఎకరానికి 200 లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి. విత్తిన నెల రోజులకు వెడల్పాటి కలుపు మొక్కలు కనిపిస్తే 2,4 డి. సోడియం సాల్ట్ ఎకరాకు 500 గ్రా. 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

## అపరాలలో కలుపుయాజమాన్యం :


అపరాల పంటలైన మినుము, పెసరలలో పెండి మిథాలిన్ 30% ద్రావణం ఎకరాకు 1.0-1.5 లీటర్లు విత్తిన వెంటనే కానీ, మరుసటి రోజున కానీ పిచికారీ చేయాలి. మాగాణి మినుములో ఊదా, చిప్పెర, గరిక లాంటి గడ్డిజాతి మొక్కల నిర్మూలనకు ఫినాక్సీఫ్రాప్ ఇథైల్ 9% ద్రావణం ఎకరాకు 250 మి.లీ 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన 15-20 రోజులప్పుడు పిచికారీ చేసి సమర్థవంతంగా కలుపును నివారించ వచ్చు.

వెడల్పాకు గడ్డి జాతి కలుపు ఉన్నప్పుడు 200 మి.లీ. ఇమజితాఫిర్ 10% ను 200 లీటర్ల నీటికి కలిపి 15-20 రోజులప్పుడు పొలంలో తేమ ఉన్నప్పుడు కలుపు 2-4 ఆకుల దశలో పిచికారీ చేయాలి.

బంగారుతీగ నిర్మూలనకు వరి పనలు తీసిన వెంటనే ఎకరాకు 1.5 లీ. పెండిమిథాలిన్ 30% మందును 20 కిలోల ఇసుకతో కలిపి సాయంత్రం వేళల్లో పొలంలో సమానంగా చల్లాలి. వెంటనే ఎకరాకు 200 లీ. నీటిని పిచికారీ చేయాలి. ఈ మందును ఒక వేళ వాడనప్పుడు విత్తిన 15-20 రోజులకు 200 మి.లీ. ఇమజితాఫిర్ 10% మందును 200 లీ. నీటిలో కలిపి ఎకరానికి పిచికారీ చేయాలి. బంగారుతీగ ఇంకా మిగిలి ఉంటే పీకి తగలబెట్టాలి. లేదా పారాక్వాట్ 10% మందును లీటరు నీటికి 5 మి.లీ. చొప్పున కలిపి బంగారుతీగ కలుపు ఉన్నచోటునే పిచికారీ చేస్తే బంగారుతీగ చనిపోతుంది.

## కలుపు మందుల వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

కలుపు మందులను వేరుగా నిల్వ చేసుకోవాలి. రైతు పొరపాటున పురుగుమందుకు బదులు కలుపు మందు పిచికారీ చేయడం వలన పంట నష్టపోయే అవకాశం ఉంటుంది.




విత్తిన వెంటనే వాడే కలుపు మందులను వెనుకకు నడుస్తూ పిచికారీ చేయాలి.

విత్తిన వెంటనే వాడే కలుపుమందులను ఫ్లాట్ ఫాన్ లేదా ఫ్లడ్ జెట్ నాజిల్‌ను ఉపయోగించి పిచికారీ చేయాలి.

ఏ పంటకు సిఫార్సు చేసిన కలుపు మందులను ఆ పంటలోనే నిర్ధారించిన మోతాదులో మాత్రమే వాడాలి.

కలుపు మందును పిచికారీ చేసేటప్పుడు చుట్ట కాల్చడం, నీరు తాగడం, ఏమైనా తినడం వంటి పనులు చేయకూడదు.

ఒక ఎకరాకు 200 లీటర్ల మందు నీరు వాడాలి.

ఈ మెళకువలు పాటించడం వలన రబీ పంటలలో పైరు సున్నిత దశల్లో కలుపును నివారించి అధిక దిగుబడులు సాధించడానికి అవకాశం ఉంది.



డా. కె. తేజేశ్వర రావు,
ప్రధాన శాస్త్రవేత్త,
వ్యవసాయపరిశోధనాస్థానం,
విజయనగరం.

# శనగ పంటలో తెగుళ్ళ యాజమాన్యం



అదిక వర్ష పాతం గాలిలో తేమ 60% ఉన్నప్పుడు పూత సమయంలో శనగలో తెగుళ్ళు రావటానికి అవకాశం ఎక్కువ తెగులు సోకిన మొక్కలను పీకి తగలపెట్టటం ఉత్తమం.

విత్తనశుద్ధి తప్పకుండా కార్బండిజం 2 గ్రాములు ఒక కేజీ విత్తనానికి చేయాలి

పంట మార్పిడి చేయటం ముఖ్యం.

పంట కోసం నేలను తయారు చేసేటప్పుడు భూమిలో కుళ్ళని మొక్కలను తీసేయాలి.

## మొదలు కుళ్ళు తెగులు :

- కాండం మొదలులో ఒక నొక్కు ఏర్పడి మొక్క చనిపోతుంది.
- తెగులు సోకిన తొలిదశలో తెల్లని శిలీంధ్రబీజాలు ఆవగింజల మాదిరి కాండం మీద కనిపిస్తాయి.



- నేలలో ఎక్కువ తేమ ఉండటం, అంతగా కుళ్ళని సేంద్రియ పదార్థాలు ఉండటం ఎక్కువ ఉష్ణోగ్రతలు ఈ తెగులు ఉధృతికి తోత్పడతాయి.
- 1.5గ్రా. విటవాక్స్ పవర్ లేదా 1.5 గ్రా. టేబ్యుకొనజోల్ లేదా కార్బండిజమ్ 2.5 గ్రా తో విత్తన శుద్ధి
- ట్రైకోడెర్మా పొడి మందును 8–10 గ్రా. కిలో విత్తనానికి కలిపి విత్తుకోవాలి.



## ఎండు తెగులు

- శనగపంటను ఎండు తెగులు ఏ దశలోనైనా ఆశించవచ్చు.
- విత్తిన 3 వారాలలో ఈ తెగులును లేత మొక్కలపై గమనించవచ్చు.
- తెగులు సోకిన లేత మొక్కలు గుంపులు గుంపులుగా చనిపోతాయి.
- ఈ మొక్కల ఆకులు పేలవమైన ఆకుపచ్చరంగులో ఉంటాయి.
- ఈ మొక్క కాండాన్ని నిలువుగా చీల్చి చూస్తే ముదురు గోధుమ వర్ణం లేదా నలుపు చారలు స్పష్టంగా కనిపిస్తాయి.
- కొన్ని సందర్భాలలో మొక్కలు పాక్షికంగా ఎండిపోతాయి.

• ఈ తెగులు కల్గించే శిలీంధ్రం భూమిలో నివశిస్తుంది. విత్తనాల ద్వారా కూడా ఈ తెగులు వ్యాప్తి చెందుతుంది.





• పంట మార్పిడి ద్వారా ఈ తెగులును అరికట్టవచ్చు.

• తెగులును తట్టుకోలేని రకాలను వరుసగా 3-4 సంవత్సరాలు ఒకే పొలంలో విత్తుకోకూడదు.

• వేసవిలో లోతుదుక్కులు చేయాలి.

• తెగులు సోకని ఆరోగ్యవంతమైన విత్తనాలను వాడాలి.

• నంద్యాల శనగ -49, నంద్యాల శనగ -452, నంద్యాల శనగ -857 , నంద్యాల శనగ -776 రకాలు ఎండు తెగులును తట్టుకుంటాయి.

• కిలో విత్తనానికి 10గ్రా. ట్రైకోడెర్మా విరిడి ఫార్ములేషన్ ను కలిపి విత్తనశుద్ధి చేయాలి.

• కార్బండిజమ్ మందును 2.5 గ్రా లేదా 1.5 గ్రా. విటవాక్స్ పవర్ లేదా 1.5 గ్రా. టేబ్యుకొనజోల్ చొప్పున కేజీ విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేసి విత్తుకోవాలి.

## వేరుకుళ్ళు తెగులు



• నీటి ఎద్దడి, 30 డిగ్రీలు కన్నా అధిక ఉష్ణోగ్రత ఈ తెగులు వ్యాప్తికి దోహదపడతాయి.

• సాధారణంగా శనగ పైరు పూత, పిందె దశలో ఈతెగులు ఆశిస్తుంది.

• పొలంలో అక్కడక్కడ మొక్కలు ఎండిపోతాయి.

• లేత మొక్కలు కూడా ఈ తెగులుకు గురవుతుంటాయి.

• తెగులు సోకిన మొక్కలను పీకితే ప్రథమ వేరు మాత్రం భూమిలోనే ఉండిపోతుంది.

• ఈ ప్రథమ వేరు నల్లబారి, కుళ్ళిపోయి పక్కవేర్లు, పీచువేర్లు లేకుండా ఉంటుంది. దీని మీద నల్లని అతి చిన్నవైన స్క్లిరోషియా ఏర్పడతాయి

## కుంకుమ (తుప్పు) తెగులు

♦ శనగ పైరు పక్వానికి వచ్చే దశలో ఆకులపై గుండ్రని, చిన్న గోధుమ/ఇటుక రంగు పొక్కులు ఏర్పడుతాయి.

♦ ఈ పొక్కులు ఆకుల అడుగు భాగంలో ఎక్కువగా ఏర్పడతాయి.

♦ కొమ్మలపై పొక్కులు అరుదుగా ఏర్పడతాయి. తెగులు తీవ్రమైనపుడు మొక్కలు పక్వానికి రాకముందే ఎండిపోతాయి.

♦ చల్లని, తడి వాతావరణం ఈ తెగులు వ్యాప్తికి దోహదపడుతుంది.



♦ ప్రతి 2-3 సు.లకు ఒకసారి పంటమార్పిడి చేయాలి.

♦ హెక్సాకొనజోల్ 400 మీ. లీ. లేదా ప్రోపికొనజోల్ 200 మీ. లీ. లేదా టెబ్యుకోనజోల్+ట్రైఫ్లోక్సీస్ట్రోబిన్ 160 గ్రా ఒక ఎకరానికి 10 రోజుల వ్యవధి లో పిచికారీ చేయాలి.

## బూజు తెగులు



♦ శనగ పైరు పూత దశలో వున్నప్పుడు ఈ తెగులు ఆశిస్తుంది.

♦ గాలిలో తేమ అధికంగా ఉన్నప్పుడు కాండం,కొమ్మలు,ఆకులు,పువ్వులు, కాయలపై ముదురు గోధుమ రంగు మచ్చలు ఏర్పడతాయి.

♦ ఈ మచ్చలపై బూజు పెరుగుదలను గమనించవచ్చు.

♦తెగులు ఆశించిన మొక్కల ఆకులు, పూలు కుళ్లిన ముద్దలుగా మారుతాయి. మొక్కలు గుంపులు గుంపులుగా చనిపోతాయి.

♦తక్కువ విత్తన మోతాదు, వరుసలు మొక్కల మధ్య సిఫారసు మేరకు దూరం పాటించాలి.

♦ హెక్సాకొనజోల్ 400 మీ.లీ. లేదా టెబ్యుకొనజోల్ 400 మి. లీ. ఒక ఎకరానికి పిచికారీ చేయాలి.



డా. ఎస్.నీలిమ,
ప్రధాన శాస్త్రవేత్త
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం,
నంద్యాల జిల్లా.



# వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకే ...

# పొలం పిలుస్తోంది

రైతు సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా ప్రకృతి సిద్ధంగా లభించే సహజ వనరులను సమర్థవంతంగా వాడుకుంటూ, నూతన సాంకేతిక యాజమాన్య పద్ధతి వైపు నడుస్తూ రైతు ఆర్థికంగా బలపడటం కోసం వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు పొలం వద్దే పొలం పరిశీలించి విశ్లేషించే కార్యక్రమమే పొలం పిలుస్తోంది.

రైతుకు సులభంగా అర్థమయ్యే రీతిలో నాణ్యమైన అధిక దిగుబడి సాధించేలా కొత్త వంగడాల వాడకంపై అవగాహన కల్పిస్తారు.

వీలైన మేర సమస్యలకు తక్షణ పరిష్కారం చూపుతూ వారంలో రెండు రోజులు రెండు గ్రామాల్లో ఉదయం సాయంత్రం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దినపత్రికలు, టీవీల్లో ప్రచారం నిర్వహించి ఉదయం పూట ఎనిమిది గంటలకే రైతులతో కలిసి పొలం సందర్శన, పరిశీలన అనంతరం ఉదయం 10 గం,, పొలం పరిశీలనాంశాలపై చర్చలు, సలహాలు, సూచనలు ఇచ్చి, పరిష్కారాలు చూపించి.. అన్ని విధాలుగా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే కార్యక్రమమే పొలం పిలుస్తోంది.

నూతన వ్యవసాయ పద్ధతులకు త్వరగా అలవాటు పడేలా వారిలో నిర్ణయం తీసుకునే శక్తిని పెంచేలా మంచి మార్పుకు వ్యవసాయ,అనుబంధ రంగాల పథకాలపై రైతును తయారు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ బృహత్ కార్యక్రమం తలపెట్టింది.

అవసరమైన మేరకే రసాయన ఎరువులు, పురుగు మందులు వాడుకునేలా ఖర్చు తగ్గించుకుని సేంద్రియ ఉత్పత్తులు పండించి నాణ్యమైన అధిక దిగుబడి సాధించేలా రైతును సన్నద్ధపరచడం ఈ కార్యక్రమ ఉద్దేశం.

జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా వ్యవసాయ అధికారి నేతృత్వంలో జిల్లాలోని వ్యవసాయ, దాని అనుబంధ శాఖలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులు అందరూ పొలంపిలుస్తోంది లో పాల్గొంటారు.

ఇందులో భూసార పరీక్షా పత్రాల పంపిణీ, వాటికి అనుగుణంగా ఎరువుల వాడకం, మేలైన విత్తనాల ఎంపిక, తప్పనిసరి విత్తన శుద్ధి వంటి పద్ధతులకు రైతులను సన్నద్ధం చేస్తారు. సహజ వనరైన నీటిని సక్రమంగా వాడుకునేలా అవగాహన కల్పిస్తారు. భూమిని సాగు చేసే కౌలు రైతులకు బ్యాంకుల ద్వారా రుణాల మంజూరు ప్రక్రియ కూడా జరుగుతుంది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రైతులను సమన్వయ పరిచి జాయింట్ లైబిలిటీ గ్రూపుగా, రైతు మిత్ర గ్రూపులుగా తయారు చేసి అందరికి పంట రుణాలు అందేలా చూస్తారు.

ఖరీఫ్ లో నాలుగు నెలలు, రబీ పంట కాలంలో నాలుగు నెలలు, ప్రభుత్వ సూచనల మేర వ్యవసాయ శాఖ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తోంది. రైతులు సద్వినియోగం చేసుకోవడమే తరువాయి.

సంకలనం... **జి.వి.శివప్రసాద్ వ్యవసాయాధికారి,** ఐ.సి.సి.గన్నవరం

# క్లిక్.. క్లిక్..





**ధరలు తగ్గాలి :** నిత్యావసరాల ధరల నియంత్రణ పై మంత్రుల బృందం చర్చ.

**మరింత ప్రోత్సాహం :** ఆయిల్ పామ్ సాగు విస్తరణపై మంత్రి వర్యుల నేతృత్వంలో సదస్సు.

**కౌలు రైతులకు మరింత మేలు చేసేలా కొత్త చట్టం :**
ఆంధ్రప్రదేశ్ సాగుదారుల హక్కుల చట్టం-2024 ముసాయిదాపై యజమానులు, కౌలు రైతులు, కౌలు రైతు సంఘాలతో ప్రాంతీయ అవగాహన సదస్సులు.




అమలాపురంలో..




కర్నూలులో ..




రాజమండ్రిలో..



# పూల తో వంటలు

ఈ కాలంలో ఎక్కువగా లభించే తాజా కాలీఫ్లవర్‌తో పసందైన వంటకాలు సులభంగా చేసుకోవచ్చు. ఇవి రుచికి, ఆరోగ్యానికి ఎంతో మంచివి. అవి ఏంటో చూద్దాం...



## ఆలు గోబీ:

ఒక టేబుల్ స్పూన్ జీలకర్ర, వెల్లుల్లి రెబ్బలు నాలుగు, అల్లం తురుము ఒక టేబుల్ స్పూన్, బాణీ లో నూనె వేడయ్యాక ఇవన్నీ అందులో వేసి వేయించాలి. ఉడికించి తొక్క తీసి పెట్టుకున్న రెండు బంగాళా దుంపలను పెద్ద ముక్కలుగా కోసి ఈ మిశ్రమంలో వేసి బాగా కలపాలి.
అర టీ స్పూను చొప్పున పసుపు, కారం, ఉప్పు, మసాలా పొడి వేసి మధ్య మధ్య లో కలుపు తుండాలి. ఉడికించి కాలీఫ్లవర్ జత చేసి బాగా కలపాలి మూత పెట్టి పది నిముషాలు ఉడికించి దింపేసి కొత్తిమీర తరుగు జత చేసి బాగా కలపాలి మూతపెట్టి 10 నిముషాలు ఉడికించి దించేస్తే ఆలు గోబీ తయారు.




## కాలీఫ్లవర్ 65

కాలీఫ్లవర్ ఒకటి మీడియం సైజు, కరివేపాకు మూడు రెమ్మలు, మైదాపిండి రెండు టేబుల్ స్పూన్లు, బియ్యపుపిండి ఒక టేబుల్ స్పూన్, కార్న్ ఫ్లోర్ ఒక టేబుల్ స్పూన్, రెండు టేబుల్ స్పూన్లు గరం మసాలా ఒక టేబుల్ స్పూన్, తగినంత పసుపు, పావు టీ స్పూను అల్లం వెల్లుల్లి ముద్ద, రెండు స్పూన్లు నూనె వేయించడానికి తగినంత.

ఒక పాత్రలో మైదాపిండి బియ్యం పిండి కార్న్ ఫ్లోర్ మిరపకారం గరం మసాల ఉప్పు అల్లం వెల్లుల్లి ముద్ద వేసి కొద్దిగా నీళ్లు జత చేసి కలపాలి. కాలీఫ్లవర్ ని శుభ్రం చేసి చిన్న చిన్న ఫ్లవర్స్ లాగా వచ్చేలా విడదీయాలి. ఒక పాత్రలో నీళ్ళు పసుపు కొద్దిగా ఉప్పు వేసి స్టవ్ మీద ఉంచి కొద్దిగా వేడి అయ్యాక విడదీసిన కాలీఫ్లవర్ ను అందులో వేసి కొద్దిసేపు ఉడికించి తీసేసి కలిపి ఉంచుకున్న పిండి మిశ్రమానికి జత చేయాలి. స్టవ్ మీద రెడీ గా ఉంచుకున్న బాణీలో నూనె కాగాక కొద్దికొద్దిగా తీసుకుంటూ నూనెలో వేసి బాగా వేగాక పేపరు టవల్ మీదకు తీసుకోవాలి కరివేపాకుతో అలంకరించి వేడివేడిగా సర్వ్ చేసుకుంటే చాలా రుచిగా ఉంటుంది.

## గోబీ మంచూరియా:



ఒక పెద్ద పువ్వు, అర టీ స్పూను మిర్యాల పొడి, టేబుల్ స్పూన్స్ కార్న్ ఫ్లోర్, అర స్పూను చిల్లీ పౌడర్, అర టేబుల్ స్పూన్ మైదా, టమోటా సాస్ ఒక టేబుల్ స్పూన్, చిల్లీ సాస్ ఒక టేబుల్ స్పూన్, సోయాసాస్ ఒక టేబుల్ స్పూన్, అల్లం వెల్లుల్లి పేస్టు ఒక టేబుల్ స్పూన్, ఉల్లిపాయ ఒకటి రెడీ చేసిపెట్టుకుని గిన్నెలో నీరు పోసి ఒక టేబుల్ స్పూన్ ఉప్పుతో వేసి ఆ నీటిని సన్న సెగ మీద వేసి వేడి చేయాలి. చిన్న ముక్కలుగా కోసిన గోబీని వేసి మూడు నిముషాల పాటు సన్నని సెగ మీద వేడి చేయాలి.

వేడి చేసిన గోబీ ముక్కలను పక్కనపెట్టి మళ్లీ చల్లని నీటిలో ముంచి తీయాలి ఇప్పుడు గోబీ ముక్కలకు రెండు టేబుల్ స్పూన్ల మొక్కజొన్న పిండి ఉప్పు మిర్యాల పొడి కారంపొడి కొద్దిగా వేసి నీటితో కలుపుకోవాలి.


బాణీలో నూనె పోసి నూనె వేడెక్కిన తర్వాత మొక్కజొన్న మైదా కలిపినటువంటి గోబీ ముక్కలను సన్నని మంట మీద వేయించి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు ఒక బాణీలో మూడు టేబుల్ స్పూన్లు నూనె వేసి నూనె వేడెక్కిన తర్వాత సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలను పచ్చి వాసన పోయే వరకు వేడి చేసి దానిలో అల్లం వెల్లుల్లి పేస్టు కూడా వేసి టమాటా సాస్, చిల్లీ సాస్, సోయాసాస్, వెనిగర్ వేసి తిప్పాలి. ఈ మిశ్రమానికి వేయించిన గోబీ ముక్కలు కలిపి నిముషం పాటు తిప్పి స్టవ్ మీద నుండి దించి దీంట్లో కొంచెం వేయించిన జీడిపప్పు, కొత్తిమీరతో కలిపి అలంకరించుకుంటే గోబీ మంచూరియా చాలా బాగుంటుంది.



## గోబీ ఫ్రైడ్ రైస్:

కాలీఫ్లవర్ 150 గ్రాములు, మైదా నాలుగు స్పూన్లు, బియ్యపు పిండి రెండు స్పూన్లు, ఉప్పు తగినంత, అల్లం, వెల్లుల్లి పేస్టు అర స్పూను, రెండు వందల గ్రాములు బాస్మతి బియ్యం, రెండు స్పూన్లు చిల్లీ సాస్ రెండు స్పూన్లు సోయాసాస్, ఒక ఉల్లిపాయ, వెల్లుల్లి ఒక చిన్న పాయ తీసుకోవాలి కారం ఉప్పు సరిపడినంతగా తీసుకోవాలి క్యాలిఫ్లవర్ ముక్కలుగా కోసి ఉప్పు వేసి నీటిలో రెండు నిముషాల పాటు ఉడకనివ్వాలి పక్కన పెట్టుకోవాలి మైదా అల్లం వెల్లుల్లి పేస్ట్ కలిపి కొద్దిగా నీటితో జోరుగా కలుపుకోవాలి. ఉడకబెట్టిన కాలీఫ్లవర్ ను ఇందులో వేసి బాగా కలుపుకొని వేడి నూనెలో వేసి ఫ్రై చేసుకోవాలి ఇప్పుడు గిన్నె లో నూనె వేసి నూనె కాగిన తర్వాత బాగా తరిగిన వెల్లుల్లి ముక్కలు క్యారెట్ క్యాప్సికం వేసి రెండు నిమిషాలు మగ్గనివ్వాలి తగినంత ఉప్పు వేసి కలుపుతూ సోయాసాస్ రెడ్ చిల్లీ సాస్ వేసి తిప్పుతూ వేసి ఒక నిమిషం పాటు ఉడకనివ్వాలి తర్వాత ఫ్రై చేసిన గోబీ ముక్కలను వేసి కలుపుతూ ముందుగా వండుకున్న అన్నాన్ని కలిపి తిప్పుకుని దించుకోవాలి


సంకలనం..



జి.వి.శివప్రసాద్
వ్యవసాయాధికారి,
ఐ.సి.సి.గన్నవరం



# వేసవి దాహం తీర్చే కర్బూజా

కర్బూజ తీగ జాతి పంట. వీటి సాగు ఎక్కువగా తీగ జాతి కూరగాయలైన గుమ్మడి, అనపలను పోలి ఉంటుంది. వీటిలో తక్కువ కాలరీలు, ఎక్కువ శాతం విటమిన్ ఎ, సి. ఉండడమే కాకుండా దాహాన్ని తీర్చే గుణం కలిగి ఉంటాయి. ఇవి అధిక ఉష్ణోగ్రత ఉన్న ప్రాంతాలలో బాగా పెరుగు తాయి. తక్కువ ఉష్ణోగ్రతను సాధారణంగా (18 డిగ్రీల సెల్సియస్) కంటే తక్కువ తట్టుకోలేవు.

**వాతావరణం:**

ఎక్కువ ఉష్ణోగ్రత (32 డిగ్రీల సెల్సియస్ వరకు) తో కూడిన పొడి వాతావరణం అనుకూలం. 23-27 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత కూడా అనుకూలం. నదికి సంబంధించిన ఇసుక తిన్నెల్లో ఎక్కువగా సాగు చేస్తారు. ఎక్కువ తేమతో కూడిన వాతావరణం అనుకూలం కాదు.

**నేలలు:**

ఇసుక నేలలు, బంక మన్ను కలిగిన నేలలు, మురుగు నీటి వసతితో ఒండ్రు కలిగిన ఇసుక నేలలు, ఉదజని సూచిక 6-6.7 ఉన్న నేలలు సాగుకు అనువైనవి. సాగు నీటి వసతి కలిగిన నేలల్లో బోదెలు ఏర్పరచి విత్తనాలను బోదెకు మధ్యలో విత్తుకోవాలి.

**విత్తేసమయం:**

డిసెంబర్ నెల రెండవ పక్షం నుంచి జనవరి నెల మొదటి పక్షం వరకు విత్తుకోవచ్చు. నారు పెంచి నాటుకునే పద్ధతిలో ఫిబ్రవరి నెలాఖరు వరకు కూడా నాటుకోవచ్చు. చలి ఎక్కువగా ఉన్నప్పుడు గింజ సరిగా మొలకెత్తదు. మొలక శాతం పెంచడానికి గోరువెచ్చని నీటిలో 2-3 గంటలు విత్తనం నానబెట్టి నాటుకోవడం చేయాలి. లేదా ప్రోట్రే లలో నారును పెంచుకోవాలి.

**ఖర్బూజ రకాలు:**

**తెల్లటి కండరకాలు:**

**అర్కరాజ హన్స్:** పండ్లు కోలగా ఉండి, ఒక కిలో బరువు కలిగి పండిన పండుపై సన్నని వల మాదిరిగా గీతలుంటాయి. రవాణాకు అనుకూలం. బూడిద తెగులును కొంతవరకు తట్టుకుంటుంది.



**అర్క జీత్:**
పండ్లు చిన్నవిగా, గుండ్రంగా, బల్లపరుపుగా ఉండి ఒక్కో పండు 300–500 గ్రాముల బరువు ఉంటుంది. పై పొర నారింజ రంగులో ఉండి, లోపలి కండ తెల్లగా, తీయగా ( టి.ఎస్.ఎస్. - 12–14) ఉంటుంది. పంట కాలం– 85రోజులు.

## నారింజ రంగు కండ కలిగిన రకాలు :

**అర్క సిరి:** ఐ.ఐ.హెచ్.ఆర్. (బెంగుళూరు) నూతనంగా విడుదల చేసిన రకం. ఎకరాకు 10 టన్నుల దిగుబడి వస్తుంది. నారింజ రంగు కండ కలిగిన రకం. కాయలు నిలువు చారలు కలిగి కొంచెం పొడవుగా ఉంటాయి. నాటిన 75–80 రోజులకు మొదటి కోతకు వస్తాయి.

**పూసా షర్బతి:** పండ్లు గుండ్రంగా ఉండి, కండ నారింజ రంగుతో మందంగా, ఒక మోస్తరు తీపితో (11–12% టి.ఎస్.ఎస్.) ఉంటుంది. పంటకాలం–85 రోజులు.

**పూసా మధురస్**: పండ్లు గుండ్రంగా, బల్లపరుపుగా ఉండి, ఒక కిలో బరువు ఉంటాయి. పండు పై తొక్క లేత ఆకుపచ్చ రంగులో, కండ నారింజ రంగులో తియ్యగా ( 12–14% టి.ఎస్.ఎస్.) ఉంటుంది. నిలువ శాతం తక్కువ.

**పంజాబ్ సునేహరి:** పండ్లపై తొక్క లేత ఆకుపచ్చ రంగులో ఉండి, కండ నారింజ రంగులో, ఒక మోస్తరు తీపితో (11–12 శాతం టి.ఎస్.ఎస్.) ఉంటుంది. ఇవి కాక కోహినూర్, కుందన్, ఎస్.ఎస్–910, ఎ.ఎస్–915, త్రిష, మధురాజ వంటి ప్రైవేట్ రకాలు కూడా మార్కెట్‌లో లభిస్తున్నాయి.

## ఆకుపచ్చ కండ కలిగిన రకాలు:

**హర మధు:** పండ్లు గుండ్రంగా (లేదా) చదునుగా ఉండి, పచ్చ రంగుతో తియ్యటి కండతో ఉంటాయి. సుమారు కిలో బరువు ఉంటాయి. ఎక్కువ కాలం నిలువ ఉండవు. ఆలస్యంగా కోతకు వచ్చే రకం.



**దుర్గాపూర్, మధు**
పండ్లు కోలగా, 500–600 గ్రాములు బరువుతో లేత ఆకుపచ్చటి గట్టి తీయటి కండకలిగి, త్వరగా కోతకు వచ్చే రకం. ఇవి కాక దీప్తి, చాంద్, మంజీత్, రేవతి, సన్ మొదలైన హైబ్రిడ్ రకాలు మార్కెట్‌లో లభిస్తాయి.



## విత్తనాలు, విత్తడం :

2–2.5 సెం.మీ. దూరంలో, 60సెం.మీ. వెడల్పు గల నీటి కాలువలను తయారు చేసుకోవాలి. కాలువలకు ఇరువైపులా 30 నుంచి 50 సెం.మీ. దూరంలో విత్తనాలు విత్తుకోవాలి. 500 నుంచి 600 గ్రాముల విత్తనం ఒక ఎకరాకు సరిపోతుంది. ఉష్ణోగ్రత తక్కువగా ఉన్నప్పుడు విత్తనాలను 6 × 4 అంగుళాల పరిమాణం గల ప్లాస్టిక్ సంచులలో ( ఒక భాగం చొప్పున ఇసుక, ఎరువు, రెండు భాగాలు మట్టితో నింపినవి) విత్తుకోవాలి. 2–3 ఆకుల దశలో ముందుగా తయారు చేసుకున్న కాలువల్లో నాటుకోవాలి.

## ఎరువులు:

ఎకరాకు 4–5 టన్నులు బాగా మాగిన పశువుల ఎరువును వేయాలి. 32–40 కిలోల భాస్వరం, 16–24కిలోల పొటాష్, 40 కిలోల నత్రజనిని ఇచ్చే ఎరువులను వేయాలి. నత్రజనిని రెండు దఫాలుగా, నాటేటప్పుడు, నాటిన 25రోజుల తరువాత వేసుకోవాలి.

## నీటి యాజమాన్యం:

ప్రధమ దశలో, మళ్ళీ కాయ ఎదిగేటప్పుడు నీటిని ఇవ్వాలి. కాయలు పక్వానికి వచ్చిన తరువాత ఎక్కువ నీరు పెట్టడం వల్ల కాయలు పగిలి నాణ్యత తగ్గుతుంది.

## అంతర కృషి:

కలుపు నివారణకు పెండిమిథాలిన్ మందును ఎకరాకు 1.2 5 లీ. లేదా అలాక్లోర్ 1 లీ. తేలిక నేలలు 1.25 లీ. ( బరువు నేలలు ) చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన 24 నుంచి 48 గంటల లోపు పిచికారీ చేయాలి. 2 నుంచి 4 ఆకుల దశలో 3 నుంచి 4 గ్రాముల బోరాక్స్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయడం వల్ల దిగుబడి పెరిగే అవకాశం ఉంది.

**దిగుబడి:**
కర్బూజ 8 నుంచి 10 టన్నులు / ఎకరం దిగుబడి వచ్చే అవకాశం ఉంది.



# కొబ్బరి లో నల్లముట్టె పురుగు జీవనియంత్రణ





కొబ్బరిని ఆశించే ప్రధాన పురుగులలో నల్లముట్టెపురుగు ఒకటి. కొబ్బరి చెట్లను నారుమడి, ఎదిగిన తోటలు, వరిచేల గట్లు చేపల చెరువుల గట్లపై గల కొబ్బరి చెట్లను అక్టోబర్ నుండి ఏప్రిల్ మాసాలలో ఆశిస్తుంది. చేపల చెరువు గట్లపై గల మొక్కలలో సంవత్సరం పొడవునా అనుకూల వాతావరణ పరిస్థితుల వలన కనపడుతుంది. వాతావరణంలో తేమ శాతం ఎక్కువగా ఉండడమే నల్లముట్టెపురుగుకు అనుకూలమైన పరిస్థితి. సరైన సమయంలో సస్యరక్షణ చేపట్టకపోతే, కొబ్బరి చెట్లనే కాకుండా, తాటి, ఈత పామాయిల్ చెట్లను కూడా ఆశిస్తుంది.

**జీవిత చరిత్ర :**

బూడిద రంగు రెక్కలు గల తల్లిపురుగు క్రింది వరుస ఆకులలో పాత గూళ్ళు ఉన్నచోట గుడ్లు పెడుతుంది. గుడ్లు 5 రోజులలో పొదగబడిన చిన్న లార్వాలు ఆకు తింటూ




ఎదుగుతాయి. గొంగళి పురుగులు ఆకు మడతలలో తింటూ దాదాపు ఒక నెల ఎదుగుతాయి. గొంగళి పురుగు దశ ఆరు దశలను పూర్తిచేసుకొని గూళ్ళు కట్టి, ఆకులను అతికించి, ఆ గూళ్ళలో నిద్రావస్థ దశను 10-12 రోజులలో పూర్తి చేసుకొని, రెక్కల పురుగుగా మారుతుంది. ఆరు వారాలలో జీవిత చక్రం పూర్తి చేసుకుంటుంది.

> కొబ్బరి లో సస్యరక్షణ కోసం రసాయన మందులను పిచికారీ చేయటం కష్టం, అందు కోసం మిత్ర పురుగులను ఉపయోగించి జీవ నియంత్రణ పద్ధతిలో సస్యరక్షణ చేయటం ఉత్తమం.
> రైతులు కూడా ఈ పద్ధతిపై ఆసక్తి కనపరుస్తున్నారు. ఆక్వా సాగుతో పాటు కొబ్బరి సాగు చేసే చోట వాతావరణం అనుకూలంగా ఉండటం వలన నల్లముట్టె పురుగుల ఉధృతి ఎక్కువ. రైతులు ఉద్యాన పరిశోధన స్థానంలో లభించే మిత్ర పురుగులను ఉపయోగించి కొబ్బరి లో నల్లముట్టె పురుగు చిన్న పురుగుగా ఉన్నప్పుడు బ్రకాన్ హెబిటర్ అనే మిత్ర పురుగుతో పెద్ద గొంగళిపురుగు దశలో గొనియోజస్ మిత్ర పురుగు తో సస్యరక్షణ చేపట్టి ఆశించిన నాణ్యమైన దిగుబడులు పొందుతున్నారు.



## నల్లముట్టె పురుగు లక్షణాలు :

పురుగు ఆశించిన ఆకులపై ఎండిన మచ్చలు ఏర్పడి తీవ్రత పెరిగిన కొలది, మచ్చలన్నీ కలిసిపోయి, ఆకు మొత్తం ఎండిపోతుంది. ఆకులన్నీ ఎండి, వాలిపోయి తోట అంతా కాలిపోయినట్లు కనిపిస్తుంది. తీవ్రస్థాయిలో ఉన్నప్పుడు కాయలు కూడా దెబ్బతింటాయి.

## నష్టం:

చిన్న మొక్కలను ఆశించినప్పుడు మొక్కలు గిడసబారి ఆలస్యంగా కాపునకు వస్తాయి. కాసే చెట్లను ఆశించినప్పుడు కాయ సైజు కూడా తగ్గిపోతాయి. పిందెలు రాలిపోతాయి. పొత్తులు రాక, దిగుబడులు తగ్గుతాయి. చెట్టు కోలుకోవడానికి ఒకటి నుండి రెండు సంవత్సరములు పడుతుంది..

## జీవనియంత్రణ పద్ధతుల ప్రాముఖ్యత:

బహువార్షిక పంట అయిన కొబ్బరిలో జీవనియంత్రణ పాత్ర ముఖ్యమైనది. అంతేకాక, కొబ్బరి తోటలలో పిచికారీ చేయడం కష్టంతో కూడుకున్నది. నల్లముట్టెపురుగు నివారణకు మిత్రపురుగులైన బ్రాకాన్ హెబిటర్, బ్రాకాన్ బ్రెవికార్నిస్ గోనియోజస్ నెఫాంటిడిస్‌లను అంబాజీపేట ఉద్యాన పరిశోధనా స్థానం, జీవనియంత్రణ ప్రయోగశాలలో వృద్ధి చేసి, రైతులకు అందుబాటు ధరలో విక్రయిస్తున్నారు.

## బ్రాకాన్ హెబిటర్ / బ్రాకాన్ బ్రెవికార్నిస్ :

బ్రాకాన్ హెబిటర్‌ను నల్లముట్టెపురుగు గొంగళిపురుగు మీద వదిలిన 48 గంటలకు గుడ్లు పెట్టును. ఒకసారి దాదాపు 6 - 10 గుడ్లు పెట్టును. దీని నుండి రెక్కల పురుగులు రావడానికి 8 రోజులు పడుతుంది. దీని జీవిత కాలం 15 నుండి 20 రోజుల వరకు ఉంటుంది. పురుగు ఆశించిన తోటలలో సుమారుగా 100 గొంగళిపురుగులకు 30 బ్రాకాన్‌లను వదలవలసి ఉంటుంది. ఒక్కొక్క బ్రాకాన్ హెబిటర్ ధర రూ. 50 పైసలు




## గోనియోజస్ నెఫాన్టిడిస్ :

గొంగళిపురుగు యొక్క చివరి దశలను ఈ పురుగు ఎక్కువగా ఆశిస్తుంది. దీని జీవిత కాలం 60 రోజుల వరకు ఉంటుంది. తోటలో విడుదల చేయడానికి ముందు పరాన్న జీవులను తేనెతో పోషించి మూడు రోజుల లోపు తోటలలో విడిచి పెట్టాలి.

## సమగ్ర సస్యరక్షణ చర్యలు:




నల్లముట్టె పురుగు ఆశించి, ఎండిన అడుగు వరుస ఆకులను తీసి కాల్చాలి. నల్లముట్టెపురుగు తక్కువ స్థాయిలో ఉన్నప్పుడు, రైతు లందరూ సామూహికంగా జీవ నియంత్రణ పద్ధతులను పాటించినట్లయితే నల్లముట్టెపురుగును సమర్థవంతంగా నియంత్రించవచ్చు.


డా.వి.అనూష,
శాస్త్రవేత్త,
ఉద్యాన పరిశోధనాస్థానం,
అంబాజీపేట
కోనసీమ.

# కాలీఫ్లవర్ లో సమస్యలు - నివారణ



**క్యాన్సర్ నిరోధక లక్షణాలు, గుండె ఆరోగ్యాన్ని పదిలపరిచే లక్షణాలున్న కాలీఫ్లవర్ వినియోగం ఎంతో అవసరం. తూర్పు ఈశాన్య రాష్ట్రాల్లో కొండల్లో ఆరోగ్యంగా పెరిగే పురుగు మందు అవశేషాలు లేని కాలీఫ్లవర్ ఎంతో రుచిగా ఉంటుంది.**
**వాతావరణంలో మార్పులు, పోషక లోపాలు కాలీఫ్లవర్‌లో దిగుబడిపై ప్రభావం చూపుతాయి. సరైన వయసుగల లేత నారు, మాలిబ్డినం ధాతు లోపం రాకుండా సిఫార్సు చేసిన మోతాదులోనే నత్రజనిని అమ్మోనియం నైట్రేట్ రూపంలో వాడుకుంటే ముప్పావు కేజీ తూగే ఆరోగ్యవంతమైన దిగుబడి పొందవచ్చు.**

కాలీఫ్లవర్ శీతాకాలపు కూరగాయలలో ముఖ్యమైనది. ఇందులో కార్బోహైడ్రేట్‌లు, విటమిన్ ఎ, సి వివిధ ఖనిజాలు సమృద్ధిగా ఉన్నాయి. మొక్కలలో కొన్నిసార్లు ఉష్ణోగ్రతలలో అసమతుల్యత, నీటి యాజమాన్యంలో లోపాలు, పోషక లోపాలవలన శారీరక రుగ్మతలు ఏర్పడతాయి. వీటి వలన దిగుబడి నాణ్యత పై ప్రభావం ఏర్పడినప్పుడు వీటిని సమగ్ర పద్ధతుల ద్వారా నియంత్రించి నష్టాన్ని నివారించాలి.

### రైసీనెస్:

వాతావరణంలో ఉష్ణోగ్రత పెరిగితే పువ్వు వదులుగా విచ్చుకున్నట్లే పువ్వు గడ్డ పై నూగు వస్తుంది. ఇటువంటి పూలకు మార్కెట్ విలువ తగ్గిపోతుంది. దీని నివారణకు అధిక ఉష్ణోగ్రతను తట్టుకునే రకాలు వేసుకోవాలి. పువ్వులను సరైన సమయంలో ఆలస్యం చేయకుండా కోత కోయాలి.









### గుడ్డితెగులు/ అంధత్వం :

మొక్క నాటుతున్నప్పుడు కానీ లేదా పురుగుల వల్ల కానీ లేదా ప్రారంభ దశలో ఎక్కువగా చలి ఉండడం వల్ల కానీ ఇది వస్తుంది. దీని వల్ల ఆకులు పెద్దగా దళసరిగా ముదురు ఆకుపచ్చ ఉండి కాలీఫ్లవర్ పూలు సరిగా రావు. దీన్ని నివారించేందుకు నాటేటప్పుడు మొక్కను జాగ్రత్తగా నాటాలి. కాలానుగుణంగా పురుగుమందులు వాడి, పురుగుల వల్ల కలిగే నష్టాన్ని తగ్గించాలి. తక్కువ ఉష్ణోగ్రతలను తట్టుకునే రకాలను సాగుచేసుకోవాలి.

### బటనింగ్ :

చిన్న చిన్న పూలు ఏర్పడడాన్ని బటనింగ్ అంటారు. ముదురు నారు నాటుకోవడం, నత్రజని లోపించడం, స్వల్పకాలిక రకాలను ఆలస్యంగా నాటడం వల్ల, ఈ సమస్య వస్తుంది. దీని నివారణకు 21 నుంచి 25 రోజుల వయస్సు గల నారును నాటుకోవాలి. తగినంత మోతాదులో నత్రజని ఎరువు వేయాలి. స్వల్పకాలిక రకాలను సరైన సమయం లోనే నాటుకోవాలి.






### బ్రౌనింగ్:

దీని ఎర్ర తెగులు లేదా గోధుమ తెగులు అని కూడా పిలుస్తారు. క్షార నేలల్లో పెంచే పంటలో బోరాన్ లోపం ఎక్కువగా వస్తుంది. బోరాన్ ధాతు లోపం వల్ల పువ్వుపై గోధుమ రంగు మచ్చలు ఏర్పడతాయి. కాండం గుల్లగా మారి నీరు కారుతుంది. దీని నివారణకు ఆఖరి దుక్కిలో ఎకరాకు 8-10 కిలోల చొప్పున బోరాక్స్ వేయాలి. లీటరు నీటికి 3 గ్రాముల బోరాక్స్ కలిపి పువ్వు ఏర్పడే దశలో పిచికారీ చేయాలి.

### కొరడాతెగులు:

ఆమ్ల నేలలో సాగు చేసినపుడు మాలిబ్డినం ధాతు లోపం ఏర్పడి ఆకులు పసుపు రంగులోకి మారి, అంచులు తెల్లబడతాయి. లోపం తీవ్రంగా ఉంటే ఒక్క మధ్య ఈనె మాత్రమే పొడవుగా పెరుగుతుంది. దీనినే కొరడా తెగులు ( విప్ టైల్ ) అంటారు. నత్రజని మోతాదు ఎక్కువైతే మాలిబ్డినం మొక్కకు అందుబాటులో ఉండదు. అందువలన దీని నివారణకు సరైన మోతాదులో మాత్రమే నత్రజని వేయాలి. ఎకరాకు 400 గ్రాముల సోడియం లేదా అమ్మోనియం మాలిబ్డేట్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.







డా. కె. ఉమామహేశ్వరి,
సీనియర్ శాస్త్రవేత్త,
సమీకృత రైతు సమాచార కేంద్రం,
గన్నవరం.




# వంగలో కొమ్మ, కాయ తొలుచు పురుగు యాజమాన్యం

వంగ పంటను చాలా రకాల పురుగులు, తెగుళ్లు, నులి పురుగులు ఆశించి దిగుబడిని గణనీయంగా తగ్గిస్తున్నాయి. వంగ రైతులకు కొమ్మ, కాయ తొలుచు పురుగు ప్రధాన ఆటంకంగా మారింది. నివారణకు సుమారు 6 నుండి 10 సార్లు పురుగు మందు పిచికారీ చేసినా పురుగు వలన జరిగే నష్టం తగ్గట్లేదు.

**కొమ్మ, కాయ తొలుచు పురుగు నష్ట లక్షణాలు:**

కొమ్మ, కాయ తొలుచు పురుగు గుడ్డు, లార్వా, ప్యూపా, తల్లి పురుగులతో కూడిన తన జీవిత చక్రాన్ని 27-32 రోజుల్లో పూర్తి చేస్తుంది. ఈ పురుగు 5-6 తరాలను పూర్తి చేసుకొని, ప్రధానంగా వంగ పంటను ఆశిస్తుంది. పురుగు దశలో లార్వా మాత్రమే హాని చేస్తుంది. ఇది మొక్కలో కొమ్మలు, పువ్వులు, పువ్వు మొగ్గలు, కాయలను ఆశించి నష్ట పరుస్తుంది. రైతులు ఖరీఫ్ లో పంట వేస్తే ఎక్కువ ఈ పురుగు కొమ్మ వద్ద ఆగస్ట్- సెప్టెంబర్ లో, కాయ వద్ద అక్టోబర్- నవంబర్‌లో గమనించవచ్చు.



**నష్ట లక్షణాలు:** తల్లి పురుగు సుమారు 250 తెల్లని రంగులో ఉండే గుడ్లను, ఆకుల వెనుక భాగాన, పచ్చని కాండం పైన, పూమొగ్గల పైన లేదా కాయ కాడ దగ్గర పెడుతుంది. ఈ గుడ్లు 3-5 రోజుల్లో పొదిగి దాని నుండి వచ్చిన లార్వా పింక్ రంగులో

కూరగాయల రాజుగా పిలిచే వంగ శాఖాహార, మాంసాహార రెండు వంటకాలలో కూడా ఎక్కువగా వాడతారు. డైటరీ ఫైబర్, ఆస్కార్బిక్ యాసిడ్, విటమిన్లు, ఫోలేట్, నియాసిన్, విటమిన్ బి6, పాంటొథినిక్ యాసిడ్, పొటాషియం, ఐరన్, మెగ్నీషియం, మాంగనీస్, ఫాస్పరస్, కాపర్ వంటి పోషకాలు వంగలో పుష్కలంగా ఉంటాయి. ఖరీఫ్, రబీ, వేసవి లలో ఏ సీజన్ లో అయినా సాగు చేయవచ్చు. కాయ తొలుచు పురుగు అక్టోబర్ నవంబర్ లో ఎక్కువగా చూడవచ్చు. చిన్న లార్వా లేత కొమ్మల లోపలికి ప్రవేశించి లోపలి భాగాలని తినేస్తుంది. కాయలు రాగానే కాయకు కూడా రంధ్రం చేసి లోపలి ఆహారాన్ని తినేస్తుంది. గుండ్రని రకాలలో వీటి ఎద్దడి ఎక్కువ. లింగాకర్షక బుట్టలు వాడి ఎరను 20 రోజులకు ఒకసారి తప్పని సరిగా మార్చి మగ తల్లి పురుగుల సంఖ్య తగ్గించటం వలన ఆడ తల్లి పురుగు గుడ్లు తక్కువ పెడతాయి.

జొన్న, మొక్కజొన్న, అపరాలు వంటి ఇతర పంటల తో 1-2 సంవత్సరాలు పంట మార్పిడి చేసుకోవాలి. కొమ్మ లేదా కాయ నష్టం 5% కంటే మించితే అంతర్వాహికగా పనిచేసే రసాయన మందులనే వాడాలి.





వడలిన ఆకులు

ఉంటాయి. ఈ చిన్న లార్వా లేత కొమ్మల లోపలికి ప్రవేశించి, కొమ్మలో లోపలి భాగాలని తినేస్తుంది. దీనివలన కొమ్మ పై భాగాలకి నీరు, పోషకాలు అందక అవి వాడిపోయి తర్వాత చనిపోతాయి. ఇలా కొమ్మ వాడి ఉండడం ఈ పురుగు వలన కనిపించే మొట్టమొదటి లక్షణం.



మొగ్గలు రాలిపోవడం

వాడిన కొమ్మల మొదళ్ళలో లార్వా చేసిన చిన్న రంధ్రాన్ని చూడవచ్చు. తర్వాత దశలో లార్వా పువ్వులు, పూమొగ్గలు, కాండాలను కూడా ఆశించి వాటిని ఆహారంగా తినేస్తుంది. కాయలు రాగానే కాయకు కూడా రంధ్రం చేసి లోపలికి కాయలో ఆహారాన్ని తినేస్తుంది, ఒక్కోసారి చేసిన రంధ్రాలను ఎండిన మలంతో మూసివేస్తుంది. పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు కొమ్మలు వాడిపోయి, మొక్కలు బలహీనపడి దిగుబడి నష్టానికి దారి తీస్తుంది. పురుగు ఆశించిన పువ్వు మొగ్గలు కూడా వాడి రాలిపోతాయి. లార్వా తొలిచిన కాయలు మార్కెట్ లో అమ్మడానికి పనికి రాకపోవచ్చు.




కాయ తొలుచు పురుగు

## యాజమాన్యం:

పురుగు ఎద్దడిని తట్టుకునే పూస పర్పుల్ లాంగ్, పూస పర్పుల్ క్లస్టర్, అర్క కేశవ్, అర్క కుసుమాకర్ రకాలను వాడాలి. పొడవుగా, సన్నగా ఉండే రకాలలో గుండ్రని రకాల కంటే తక్కువ ఎద్దడి ఉంటుంది. అధిక దిగుబడినిచ్చే ఇతర రకాలు లేదా హైబ్రిడ్లు వాడితే పంట సాగులో ముందు నుండే జాగ్రత్తలు వహించాలి.

పురుగు ఎద్దడి ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో జొన్న, మొక్కజొన్న, అపరాలు వంటి ఇతర పంటలను 1-2 సంవత్సరాలు వేస్తే మంచిది. దీనివలన పురుగుకి ఆహారం దొరకక తర్వాత సీజన్లో ఎద్దడి తగ్గుతుంది. వంగలో బంతి, కొత్తిమీర లేదా ఉల్లి ను అంతర పంటగా వేసినా కొంతవరకు పురుగు హాని తగ్గుతుంది.



పంట తొలి దశలో, 15-20 రోజులకు ఎకరానికి 10-12 లింగాకర్షక బుట్టలు వాడి మగ తల్లి పురుగుల సంఖ్యను తగ్గించవచ్చు. తద్వారా పంటపై ఆడ తల్లి పురుగు గుడ్లు తక్కువగా పెడతాయి. ఎరను 20 రోజులకు ఒకసారి తప్పని సరిగామార్చాలి. తల్లి పురుగులు పంట తొలిదశలో కనబడిన వెంటనే ట్రైకోగ్రామా ఖిలోనిస్ పరాన్నజీవి (ట్రైకోకార్డ్)ని వారానికి 20,000 చొప్పున 3-4 సార్లు వాడాలి.

25-30 రోజుల సమయంలో గుడ్లను, చిన్న లార్వాలను చంపే వేప నూనె ( 3000 లేదా 5000 పి. పి. ఎం) 5 మి.లీ ను ఒక లీటరుకు చొప్పున పిచికారీ చేయాలి. పురుగు తీవ్రత బట్టి 2-3 సార్లు వారం రోజుల వ్యవధిలో వాడాలి.

పురుగు ఆశించి కొమ్మలు వాడినట్లు అయితే ఒక అంగుళం క్రిందికి ఆ కొమ్మను తుంచి నాశనం చేయాలి. వీలైతే ఆ కొమ్మలను పొలానికి దూరంగా పడేయాలి.లార్వా ఆశించిన కాయలను కూడా చిన్న కాయల దశలోనే ఏరి దూరంగా పడేయాలి.

కొమ్మ లేదా కాయ నష్టం 5% కంటే మించితే సిఫారసు చేసిన రసాయన పురుగు మందులను మాత్రమే వాడాలి. వంగలో కొమ్మ, కాయ తొలుచు పురుగు యాజమాన్యం కొరకు ప్రొఫెనోఫాస్ 50 ఇ.సి 2 మి.లీ. (ఎకరాకు 400 మి. లీ) లేదా థయోడికార్బ్ 75 డబ్ల్యు.పి. 2.0 గ్రా. (ఎకరాకు 400 గ్రా.) లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 18.5% ఎస్.సి 0.3 మి. లీ (ఎకరాకు 60 మి. లీ) లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 5% ఎస్.జి 0.4 గ్రా. (ఎకరాకు 80 గ్రా) చొప్పున పిచికారీ చేయాలి. వాడిన మందును ఎక్కువ సార్లు వాడకుండా వేరే మందులతో మార్చి వాడితే మంచిది. ఈ లార్వా మొక్క లోపలి భాగాల లో నివాసం ఉండి తినే స్వభావం కలది కాబట్టి పురుగు మందు దాని శరీరంలోకి వెళ్ళడానికి చాలా ఆటంకాలు ఉన్నాయి. అందువలన రైతులు ఈ విషయం గుర్తుపెట్టుకొని విచక్షణా రహితంగా మందుల పిచికారీ చేయడం ఆపాలి. అదేవిధంగా ముందునుండే పైన తెలిపిన సమగ్ర సస్య రక్షణ పద్ధతులను పాటించి, పంటను, పర్యావరణాన్ని కాపాడుకోవాలి.



డా.బీకె కిశోర్ రెడ్డి,
శాస్త్రవేత్త
కృషి విజ్ఞాన కేంద్రం, రెడ్డిపల్లి ,
అనంతపురం

మీకు తెలుసా..

# పుంగనూరు ఆవు విశిష్ఠత

దేశంలోనే ప్రాముఖ్యత సంతరించుకున్న ఆవులలో పుంగనూరుజాతి ఆవులు ఒకటి పొట్టిగా కనిపించే ఈ రకం జాతి ఆవులకు పుంగనూరు ప్రసిద్ధి. చూడటానికి ఆవు దూడ వలె కనిపించే పుంగనూరు ఆవు సాక్షాత్తు పరమశివునికి వాహనము నందిగా కొలుస్తారు.

మన దేశంలో రకరకాల పశు జాతులు ఉండగా పుంగనూరు పశువులు 70 నుంచి 90 సెంటీమీటర్లు ఎత్తు ఉంటాయి 115 నుంచి 200 కిలోలు బరువు ఉంటాయి పుంగనూరు జాతి ఆవులు తెలుపు లేదా గోధుమ రంగు లో ఉంటాయి. ఇవి రోజుకు 4 కేజీల గడ్డి మాత్రమే తింటాయి. అన్ని రకాల పరిస్థితులను కూడా తట్టుకుని జీవించగలవు

చిన్న చెవులు, మూపురం, తోక నేలకు ఆనడం, గంగడోలు కిందకు రావడం, ముందు కాళ్లు పొడవుండి వెనక కాళ్లు పొట్టిగా ఉండటం వీటి లక్షణాలు. వీటిపైన నీళ్లు పోస్తే వెనక్కి వెళ్లిపోతాయి. అలాంటి లక్షణాలుంటే దాన్ని అసలైన పుంగనూరు ఆవుగా గుర్తించవచ్చు. చిన్న ఆవులైనా సరే వీటికి మూపురం ఉంటుంది.

చరిత్రను పరిశీలిస్తే ఈ ఆవులను క్రీస్తు శకం 610 సంవత్సరంలో కనుగొన్నారు చోళ రాజులు పుంగనూరు ఆవులను తమ సంస్థానంలో పోషించే వారు. పుంగనూరు నుంచి తిరుపతి వరకు ఉన్నటువంటి అప్పటి అభయారణ్యంలో వీటి అభివృద్ధి బాగా సాగింది ఈ ఆవులు పొట్టిగా ముద్దుగా ఉండటం ఆవు ఇంట్లో ఉంటే మంచిదని, చూడటానికి ఆకర్షణ గా కనపడి ఇళ్ళల్లో అపార్టుమెంట్లలో కూడా పెంచుకుంటున్నారు. కాని వీటి ఖరీదు ఈ ఆవులకున్న క్రేజ్ వల్ల చాల ఎక్కువగా వుంది.

నరేంద్రమోదీ ఈ మధ్యే పుంగనూరు జాతికి చెందిన దూడ తన ఇంట్లో పుట్టిందని దానికి ఆహ్వానం చెబుతూ తన ఎక్స్ ఖాతా లో పోస్ట్ చేశారు. కానీ వీటి సంఖ్య ఇప్పుడు వందల్లో మాత్రమే ఉంది. అంతరిస్తున్న వీటిని రక్షించడానికి ఏపీ ప్రభుత్వం మిషన్ పుంగనూరు కూడా మొదలుపెట్టింది. దేశంలో వందలలోనే ఉన్నవీటి సంఖ్య పెంచాలంటే అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలలో వీటి వీర్యం అందుబాటు లో ఉంచి దేశీ ఆవులు ఉన్న రైతులకు అందిస్తే ఈ జాతి అభివృద్ధి చెందుతుంది.

ఈ ఆవు పాలకు ప్రత్యేక డిమాండ్ ఉంది. చాలా చిక్కటి పాలు ఇస్తాయి మామూలు పాలలో కొవ్వు శాతం 3 నుంచి 5 దాకా ఉంటే వీటి పాలలో కొవ్వు 8 శాతం. చాలా క్రీమీ గా ఉంటాయి. పుంగనూరు గోవు పాలు గరిటెడు తాగినా చాలేమో. అన్ని పోషకాలుంటాయి వీటిలో. ఒమేగా ఫ్యాటీ యాసిడ్లు, పొటాషియం, కాల్షియం పుష్కలంగా ఉంటాయి. అదే వీటికి ప్రత్యేక ఆకర్షణ. రైతులు కూడా వీటిని తక్కువ ఖర్చుతో పెంచుకోవచ్చు. ఎటువంటి ప్రతి కూల పరిస్థితులనైనా ఇవి తట్టుకుంటాయి. ఈ ఆవు పొట్టిగా ఉండి, చూడగానే ఆకర్షిస్తుంది.





# ముంపుకు గురైనా..

ఇటీవల అకస్మాత్తుగా వచ్చిన వరద వల్ల కృష్ణా పరీవాహక ప్రాంతంలో వేసిన పసుపు పంట పూర్తిగా కుళ్లిపోయి రైతులు నష్టపోవడం జరిగింది. కానీ కృష్ణా జిల్లా మోపిదేవి మండలం మోపిదేవి గ్రామానికి చెందిన పసుపు రైతు బొందలపాటి వెంకటేశ్వర ప్రసాద్ తన ఆలోచనా విధానంతో మేలైన పద్ధతులు పాటించి పసుపు పంట ముంపుకు గురైనా 80% వరకు పంటను కాపాడుకున్నారు.

పసుపును ఎత్తు మడులపై జంట సాళ్ల పద్ధతిలో నాటారు. డ్రిప్ ద్వారా నీటిని అందిస్తున్నారు. ఆఖరి దుక్కిలో సూచించిన ఎరువులు వేసుకొన్నారు. 45 రోజులకు వరద ప్రభావంతో పసుపు పంట ముంపుకు గురైనా ఆదుర్దా పడలేదు. మొక్క ఎత్తు మడులపై వుండటం వలన వరద నీరు సాళ్లలోకి వచ్చినా దుంపకి అంత నష్టం కలగలేదు.

పది రోజులు పైగా నీరు పొలంలో ఉండటం వలన దుంప కుళ్ళకుండా నీరు పోయిన తర్వాత కాపర్ సంబంధిత శిలీంద్ర నాశినిని పిచికారీ చేయటం వల్ల కొత్త వేరు ఏర్పడి కొత్త మొలకలు కూడా వచ్చాయి మరియు పోషకాల లోపం రాకుండా కాపర్, మెగ్నీషియం, సల్ఫర్ సూక్ష్మ పోషకాలను కూడా పిచికారీ చేశారు. మొక్కలు ఆరోగ్యంగా పెరుగుతుండడంతో కాంప్లెక్స్ ఎరువులను వేశారు. పంట ఏపుగా పెరిగింది. ఆశించిన దిగుబడి తప్పక వస్తుందని నమ్మకంతో ఉన్నారు.

తోటి రైతులు వరద నీరు పోయిన వెంటనే ఎటువంటి శిలీంద్ర నాశినులు వాడలేదు. కాంప్లెక్స్ ఎరువులను వాడటం వలన దుంప పూర్తిగా కుళ్ళిపోయి పంట నష్టపోవడం జరిగిందని ఉద్యాన శాస్త్రవేత్తలు తెలియచేశారు.



విజయగాథ

# బంతి సాగు ఆదాయం భలే బాగు



తక్కువ పంట కాలం, రోజు ఆదాయం వచ్చే అంతర పంటల సాగుతో రైతు రాబడికి ఢోకా ఉండదని, ఇతర పంటల సాగుకు పెట్టుబడి ఖర్చులకు వెదుకోనక్కర్లేదని నిరూపిస్తున్నారు ఓ మహిళా అభ్యుదయ రైతు. ఒకటిన్నర ఎకరం భూమిలో పదేళ్ళుగా బంతి పూల సాగు చేస్తున్న ఆమె అనుభవాలు తెలుసుకుందాం. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం మెల్లంపూడి గ్రామానికి చెందిన చిరుపూడి మల్లీశ్వరి కుప్పం నుంచి 15,000 (పసుపు 10 వేలు, ఎరుపు 5 వేలు) మొక్కలు ఒక్కో మొక్క రూ. 3 వంతున తెచ్చు కున్నారు. జనవరి మొదటి వారంలో నాటడం మొదలుపెట్టి వారం, పది రోజుల విరామాల్లో మొత్తం ఎకరంన్నరలో మొక్కలు నాటారు. వాతావరణం, మార్కెట్ పరిస్థితులను తట్టుకునేందుకు ఈ పద్ధతి పాటించారు. కొందరు ఎకరానికి 6 వేలు మొక్కలు మాత్రమే వేశారని, అయితే మంచి దిగుబడి పొందాలంటే ఎక్కువ మొక్కలు నాటడం మేలని తెలుసుకున్నారు మల్లీశ్వరి. అదే పద్ధతి పాటిస్తున్నారు. బంతి మొక్కలు నాటిన తర్వాత వారానికోసారి నీటి తడి ఇవ్వాలి, ఇరవై రోజులకోసారి కలుపు తీయాలి. వారానికోసారి పురుగు, దోమ, తెగుళ్ళ మందు కొట్టారు. పది రోజులకోసారి డి.ఎ.పి. చల్లారు. 45 రోజుల నుంచి పూలు పూస్తాయి. ఆ తర్వాత 60 రోజుల వరకు పూల దిగుబడి వస్తుంది. వాతావరణం అనుకూలిస్తే మరో 10 రోజులు పూలు పూస్తాయి. ప్రతి కోతలో 3-4 క్వింటాళ్ళ దిగుబడి వస్తుంది. మార్కెట్ లో కిలో రూ. 30-40 పలుకుతోంది. ఎకరానికి 10 టన్నులు దిగుబడి వస్తుంది. శీతాకాలంలో అయితే పూల దిగుబడి ఇంకా పెరుగుతుంది. పూలను విజయవాడ మార్కెట్ కు తీసుకెళతారు. బంతి పూల మొక్కలు నాటిన 20 రోజులకు అంతర పంటగా అరటి మొక్కలు నాటారు. పూల కోతకు నలుగురైదుగురు కూలీలు సరిపోతారు. మొత్తం మీద రూ. లక్ష పెట్టుబడి అయిందని ఆమె చెప్పారు. ఈ పంట పూర్తయ్యేసరికి అరటి మొక్కలు ఎదిగి అందుబాటులోకి వస్తాయి. పదేళ్ళుగా ఇలా బంతి, అరటి వంటి అంతర పంటలతో కచ్చితమైన నికర ఆదాయం పొందగలుగుతున్నామని ధీమాగా చెబుతున్నారు మల్లీశ్వరి.

**-పాడి పంటలు ఛానల్ సౌజన్యంతో**

https://youtu.be/CfsPx7MYm1U

# సేంద్రియ పద్ధతి లో పెరటి సాగు



నిరుపేద వ్యవసాయ కూలీ కుటుంబాలు తమ రోజువారీ వ్యవసాయ కార్యకలాపాలలో భాగంగా విచక్షణారహితంగా వాడుతున్న విషపూరిత రసాయనాలను పీల్చడంతో పాటు రసాయన అవశేషాలు కలిగియున్న ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం వల్ల తీవ్రమైన అనారోగ్యాల బారిన పడుతున్నారు. దీనికి తోడు వాతావరణ మార్పుల వల్ల కలిగే అనేక దుష్పరిణామాలకు కూడా ఈ రైతు కూలీ కుటుంబాలు ఎక్కువగా గురి అవుతున్నాయి.

మన నిత్యజీవితంలో ఆకుకూరలు, కూరగాయలు మరియు పండ్లు పోషకాహారంలో ఒక ముఖ్యమైన స్థానాన్ని ఆక్రమించాయి. ముఖ్యంగా నిరుపేద కుటుంబాలకు పోషక పదార్థాలతో కూడిన ఆహారం సమకూరేది కేవలం వీటి ద్వారానే అంటే అతిశయోక్తి కాదు. పోషకాహార నిపుణుల అధ్యయనాల ప్రకారం సగటు మనిషికి రోజుకు కనీసం 85 గ్రా. పండ్లు, 300 గ్రా. కూరగాయలు తీసుకున్నప్పుడే సమతుల్యమైన ఆహారం అందినట్టు చెప్పబడుతున్నది. కానీ, మన దేశంలో ప్రస్తుతం కాయగూరలు ఉత్పత్తి అవుతున్నగణాంకాలను చూస్తే రోజుకు సగటున ఒకరికి కేవలం 120 గ్రా. కూరగాయలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. దీని వలన ప్రధానంగా నిరుపేద మరియు వ్యవసాయ కూలీ కుటుంబాలు పౌష్టిక ఆహారానికి చాలా దూరం అవుతున్నాయి. పోషకాహార లోపాలకి గురియై రోగాల బారిన పడుతున్నారు.

ఈ నేపథ్యంలో నిరుపేద కుటుంబాల అవసరాలను గుర్తించి రైతు సాధికార సంస్థ నిరుపేద రైతుకూలీ కుటుంబాలకు పోషక విలువలతో కూడిన కూరగాయలను అందించేందుకు ప్రకృతి వ్యవసాయ విధానంలో పెరటి తోటల పెంపకం అందుబాటులోకి తీసుకొని వచ్చింది.

## పెరటితోటల పెంపకం, వాటి ప్రాముఖ్యత:

అందుబాటులో ఉన్న ఇంటి పెరటి/ఖాళీ ప్రదేశాలలో పెంచిన ఆకుకూరలు, కూరగాయలు మరియు పండ్ల చెట్ల సమూహాన్ని "పెరటి తోట" గా చెప్పుకొనవచ్చు.

ఆకుకూరలు, కూరగాయలు మరియు పండ్ల చెట్ల సమూహాన్ని, 12 నెలల/సంవత్సరం పాటు రిలే పంటల తరహాలో క్రమం తప్పకుండా ఇంటి పెరటి/ఖాళీ ప్రదేశాలలో పెంచిన పెరటి తోటను "365 రోజుల పెరటి తోట (365 Days Green Cover Kitchen Garden- 365 DGC-KG)" గా పరిగణించాలి.

పెరటితోటల పెంపకం వలన కుటుంబానికి ఆరోగ్యం సిద్ధిస్తుంది (శారీరక మరియు మానసిక ఆరోగ్యం). కుటుంబ సభ్యులకు కావలసిన పోషక పదార్థాలు అనగా పిండి పదార్థాలు, మాంస కృత్తులుతో పాటు అనేక ఖనిజ లవణాలు, విటమిన్లు అన్నీ పెరటితోటల పెంపకం వలన పొందవచ్చు.

పెరటి తోటల్లో పండించిన కూరగాయల్లో అన్నిరకాల సూక్ష్మ పోషకాలు ఉంటాయి. తద్వారా కుటుంబ సభ్యులకు పోషకాలతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. మార్కెట్లో దొరుకుతున్న కాయగూరల్లో ఇవన్నీ ఉండవు. ఎందుకంటే అవి రసాయన ఎరువులు, పురుగుమందులు వాడి పండించినవి. అంతే కాకుండా రసాయన పురుగు మందులతో పండించిన కాయగూరల వలన అనేక రోగాలు వస్తున్నాయని డాక్టర్లు చెబుతున్నారు. అందువల్ల ప్రతి కుటుంబం ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పెరటి తోటలను పెంచుకోవాలి. పెరటి తోటలవలన పేదరిక కుటుంబాల వారు ఆర్థికంగా కూడా లబ్ది పొందుతారు.

## 365 రోజుల పెరటి తోటల పెంపకానికి కొన్ని ముఖ్య నియమాలు మరియు సూచనలు:

1. పెరటి తోటలను ఏడాది పొడవున సాగు చేయాలి.
2. కాలానికి తగినట్లు కూరగాయలను మరియు వాటి రకాలను ఎంపిక చేసుకోవాలి.
3. నేల స్వభావాన్ని, నీటి సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని, పంటలను బట్టి కూరగాయల పెంపకాన్ని ఎత్తు మడులలో లేదా కాలువలు, బోదెల పద్ధతిలో చేపట్టవచ్చు.
4. ఇంటి వెనక లేదా ఇంటి ముందు పెరటి తోటలను సాగు చేయాలి. బోరు, బావి లేదా కుళాయి నీటితో ఏడాది పొడవునా కూరగాయలను పండించాలి.
5. పంటల వైవిధ్యం ఉండాలి, అంటే కాలానుగుణంగా అన్నిరకాల పంటలను పండించాలి. ఎక్కువ పంటలు ఒకే కాలంలో పండించాలి. ఆకుకూరలు, కాయగూరలు, దుంప రకాలు, తీగజాతి, ఉల్లి, వెల్లుల్లి, క్యాబేజీ, కాలీఫ్లవర్, పళ్ళు ఔషధ మొక్కలు, పూలమొక్కలు, కరివేపాకు, మునగ, బొప్పాయి, జామ, అరటి అన్ని రకాలు ఉండాలి. అప్పుడే ప్రకృతి వ్యవసాయ ఫలితాలు వస్తాయి. నేల సారవంతం అవుతుంది. చీడపీడల బాధ ఉండదు.
6. బంతి మరియు చామంతి పూల మొక్కలు తప్పనిసరిగా ఉండాలి. ఎందుకంటే ఇవి పూలను ఇవ్వడంతో పాటు ఎర పంటలుగా కూడా ఉపయోగపడతాయి. అదనంగా స్థలాన్ని అనుసరించి ఇతర పూల మొక్కలను కూడా నాటుకోవచ్చు.
7. బీజామృతంతో విత్తనశుద్ధి తప్పని సరిగా చేయాలి. ఘనజీవామృతం, ద్రవజీవామృతం, కషాయాల వాడకం, ప్రకృతి వ్యవసాయ సూత్రాల ప్రకారం చేయాలి.
8. వీలుని బట్టి ఆచ్ఛాదనగా వేపాకులు, కానుగ ఆకులు లేదా ఏదైనా ఇతర పంట/చెట్ల వ్యర్థాలను వాడుకోవాలి.
9. పెరటి తోటల పెంపకం కోసం సాధ్యమైనంత వరకు సొంత/దేశి విత్తనాలు సమకూర్చుకోవాలి.



# సమీకృత రైతు సమాచార కేంద్రం టోల్ ఫ్రీ నంబరు 155251 కు రైతుల ప్రశ్నలు - సమాధానాలు

## వ్యవసాయ పంటలు

1) రైతుపేరు: వై. సుధాకర్ రెడ్డి, గ్రామం:ముక్తాపురం, మండలం: కనగానపల్లి, జిల్లా:శ్రీసత్యసాయి, ఫోన్ నెంబర్:9573110379.

ప్ర:ఆముదంలో పురుగులు ఆకులను తినేయడం వలన జల్లెడలా మారుతున్నాయి. నివారణ చెప్పండి?

జ:ఆముదంలో దాసరి పురుగు నివారణకు ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లేదా నోవల్యూరాన్ 1 మి.లీ. లేదా ఫ్లూబెండమైడ్ 0.2 మి.లీ.ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. ఎకరానికి 10 చొప్పున పక్షి స్థావరాలను ఏర్పాటు చేయాలి.

2) రైతుపేరు: యన్.కాంతయ్య, గ్రామం: పి.సి.ప్యాపిలి, మండలం: వజ్రకరూర్, జిల్లా: అనంతపురం, ఫోన్ నెంబర్: 9618933008.

ప్ర: కంది పంటలో ఆకులు పసుపు రంగులోకి మారిపోతున్నాయి. నివారణ తెలుపగలరు ?

జ: కంది పంటలో పోషక లోపం సవరణకు పొటాషియం నైట్రేట్ 5 గ్రా. లేదా 19:19:19 5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

3) రైతుపేరు: జనార్ధన్, గ్రామం: గడివేముల,మండలం: గడివేముల, జిల్లా: నంద్యాల, ఫోన్ నెంబరు: 8106620091.

ప్ర: జొన్న పంటలో వెడల్పాటి ఆకు కలుపు ఉంది. నివారణ సూచించగలరు ?

జ: 25-30 రోజుల జొన్న పంటలో వెడల్పాటి ఆకు కలుపు నివారణకు 2,4-డి సోడియం సాల్ట్ 400 గ్రా. లేదా 2,4-డి అమైన్ సాల్ట్ 400 మి.లీ. ను 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

4) రైతుపేరు: గోవింద్ నాయక్, గ్రామం: మడకశిర, మండలం: మడకశిర, జిల్లా: శ్రీ సత్యసాయి, ఫోన్ నెంబర్: 8897039303.

ప్ర: రాగి పంటను ఏ సమయంలో విత్తుకోవచ్చో తెలుపగలరు?

జ: రబీలో రాగి పంటను నవంబరు నుంచి డిసెంబరు నెలల్లో విత్తుకోవడానికి అనుకూలం. వేసవి పంటగా జనవరిలో విత్తుకోవచ్చు.

5) 5) రైతుపేరు: పి. సూర్యనారాయణ, గ్రామం: కె. పాలవలస, మండలం: గరివిడి, జిల్లా: విజయనగరం, ఫోన్ నెంబర్: 9618870025.

ప్ర: మొక్కజొన్న విత్తుకోవాలని అనుకుంటున్నాము. విత్తన శుద్ధి గురించి తెలుపగలరు?

జ: కిలో మొక్కజొన్న విత్తనానికి సయాంట్రానిలిప్రోల్ + థయోమిథాక్సాం మిశ్రమం 6 మి.లీ. చొప్పున కలిపి విత్తన శుద్ధి చేసిన తరువాత మాంకొజెబ్ 3 గ్రా. చొప్పున పట్టించి విత్తుకుంటే తొలిదశలో మొక్కలను పురుగులు, తెగుళ్ల బారి నుండి కాపాడుకోవచ్చు.

6) రైతుపేరు:వీరవెంకటరాఘవరావు, గ్రామం: మర్లపాలెం, మండలం: చాట్రాయి, జిల్లా: ఏలూరు, ఫోన్ నెంబర్:9492810879.

ప్ర: వరి కంకులలోని గింజలు పసుపుపచ్చ ముద్దగా ఏర్పడి, ఆకుపచ్చరంగులోకి మారి చివరకు నల్లబడిపోతోంది. నివారణ తెలపండి ?

జ: వరిలో మానిపండు తెగులు నివారణకు ప్రోపికొనజోల్ 1 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలి. ముందు జాగ్రత్త చర్యగా పొట్ట దశలో మరియు వెన్నులు పైకి వచ్చే దశలో సాయం కాలపు సమయాల్లో మాత్రమే ప్రోపికొనజోల్ 1 మి.లీ. లీటరు నీటికి పిచికారీ చేసుకోవాలి.

7) రైతు పేరు: రామాంజనేయుల రెడ్డి, గ్రామం: తొలగనపల్లి, మండలం: వల్లూరు, జిల్లా: వై.ఎస్.ఆర్, ఫోన్ నెంబర్: 9398177165.

ప్ర: మినుములో ఆకులపై లేత పసుపు రంగు అంచులతో కూడిన చిన్న చిన్న గోధుమ రంగు మచ్చలు కనిపిస్తున్నాయి. సలహా చెప్పగలరు?

జ: మినుములో పక్షికన్ను తెగులు నివారణకు మాంకోజెబ్ 2.5 గ్రా. లేదా హెక్సాకొనజోల్ 2 మి.లీ. లేదా ప్రోపికొనజోల్ 1 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి 10 రోజుల వ్యవధితో 2 సార్లు పిచికారీ చేసుకోవాలి.

8) రైతుపేరు: రవిప్రకాష్, గ్రామం: రెడ్డివారి జమ్మలదిన్నె, మండలం: ఉయ్యాలవాడ, జిల్లా: కర్నూలు, ఫోన్ నెంబర్: 9916082872.

ప్ర : శనగ పంట విత్తుకున్నాము. కలుపు సమస్య రాకుండా సలహా చెప్పగలరు?

జ: శనగ పంట విత్తిన 24-48 గంటల లోపు ఎకరాకు 1.00 - 1.25 లీ. పెండిమిథాలిన్ ను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

## ఉద్యానశాఖ

1) రైతుపేరు: రామ్మోహన్ రావు, గ్రామం: పెరవలి, మండలం: వేమూరు, జిల్లా: తూర్పుగోదావరి, ఫోన్ నెంబర్: **9866216108.**

ప్ర: సీతాఫలంలో ఆకులు, కాయలపై పిండి నల్లి ఆశించింది. నివారణ చెప్పండి?

జ: సీతాఫలంలో పిండినల్లి నివారణకు ముందుగా గంజి ద్రావణాన్ని పలుచగా కలిపి పిచికారీ చేసిన తరువాత వేప నూనె 3-5 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. పురుగులు ఎక్కువగా ఆశించిన కాయలను తొలగించి నాశనం చేసి. పిచికారీ చేయడం మంచిది.

2) రైతుపేరు: పి. చంద్ర, గ్రామం: తొండూరు, మండలం: తొండూరు, జిల్లా : వై.ఎస్.ఆర్, ఫోన్ నెంబర్: **8639318453.**

ప్ర: టమాటాలో ఆకులపై తెల్లని వలయాకారపు గీతలుగా ఏర్పడుతున్నాయి. నివారణ తెలుపగలరు?

జ: టమాటాలో ఆకు తొలుచు పురుగు నివారణకు వేపనూనె (1500 పి.పి.ఎం.) 5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

3) రైతుపేరు: కొండబాబు, గ్రామం: తునివలస, మండలం: చీడికాద, జిల్లా: అనకాపల్లి, ఫోన్ నెంబర్: **9491907310.**

ప్ర: ఆయిల్ పామ్ తోట నాటి 16 నెలలు, కలుపు ఎక్కువగా ఉంది. నివారణ తెలపండి?

జ: ఆయిల్ పామ్ తోటలో కలుపు నివారణకు గ్లూఫోసినేట్ అమ్మోనియం 1 లీ. ను 200 లీటర్ల నీటికి కలిపి ఎకరం పొలంలో మొక్కల మధ్య డోమ్ సహాయంతో కలుపుపై పిచికారీ చేయాలి.

4) రైతుపేరు: వెంకట రత్నం, గ్రామం: ఆత్రేయపురం, మండలం: ఆత్రేయపురం, జిల్లా: తూర్పుగోదావరి, ఫోన్ నెంబర్: **8374920204.**

ప్ర: లిల్లీలో తామర పురుగులు ఆశించాయి. నివారణ చెప్పగలరు?

జ: లిల్లీలో తామర పురుగుల నివారణకు ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.4 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. ఎకరానికి 20 చొప్పున నీలి రంగు జిగురు అట్టలు పెట్టాలి.

5) రైతు పేరు: అనిల్, గ్రామం: గోటూరు, మండలం: వల్లూరు, జిల్లా: వై.ఎస్.ఆర్, ఫోన్ నెంబర్: **7386228020.**

ప్ర: పసుపులో ఆకులపై ముదురు గోధుమ రంగు పెద్ద అండాకారపు మచ్చలు ఏర్పడ్డాయి, ఆకులు వాలిపోతున్నాయి. నివారణ తెలుపగలరు?

జ పసుపులో తాటాకు మచ్చ తెగులు నివారణకు ముందుగా తెగులు ఎక్కువగా సోకిన ఆకులను తీసివేసి తగులబెట్టాలి. తరువాత థయోఫానేట్ మిథైల్ 1 గ్రా. లేదా ప్రొపికొనజోల్ 1 మి.లీ. లేదా కార్బండిజం + మాంకోజెబ్ మిశ్రమం 2 గ్రా. తో పాటుగా 0.5 మి.లీ. జిగురును లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

6) రైతుపేరు: వీరారెడ్డి, గ్రామం: పాలివేరుపల్లి, మండలం: బద్వేల్, జిల్లా: వై.ఎస్.ఆర్, ఫోన్ నెంబర్: **9542949956.**

ప్ర : తోటకూరలో ఆకుల అడుగు భాగాన తెల్లటి బుడిపెల వంటివి ఏర్పడి, ఆకు పై భాగాన లేత పసుపు రంగు మచ్చలు ఏర్పడి, పండుబారి ఎండిపోతాయి. నివారణ చెప్పగలరు?

జ:తోటకూరలోతెల్లమచ్చ తెగులు నివారణకు లీటరు నీటికి కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లేదా మాంకోజెబ్ 2.5 గ్రా. చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలి.

7) రైతు పేరు: సత్యనారాయణ, గ్రామం: భీములదేవి, మండలం: నరసాపురం, జిల్లా: పశ్చిమ గోదావరి, ఫోన్ నెంబర్: **9059842599.**

ప్ర: వంగలో ఆకుల అడుగుభాగాన పురుగులు రసాన్ని పీల్చటం వలన పసుపు రంగుకు మారి ఎండిపోతున్నాయి. నివారణ తెలుపగలరు?

జ: వంగలో రసం పీల్చే పురుగుల నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.6 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి మొక్క పూర్తిగా తడిచేలా పిచికారీ చేసుకోవాలి.

8) రైతుపేరు: వీరల శ్రీనివాస్, గ్రామం: దావాజీగూడెం, మండలం: గన్నవరం, జిల్లా: కృష్ణా, ఫోన్ నెంబర్: **8985608552.**

ప్ర: రేగులో చిన్న చిన్న గొంగళి పురుగులు ఆశించి ఆకులు, కాయలను నష్ట పరుస్తున్నాయి. నివారణ తెలపండి?

జ: రేగులో గొంగళి పురుగుల నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి చెట్లు పూర్తిగా తడిచేలా పిచికారీ చేయాలి.

# వాట్సాప్ నెంబర్లకు వచ్చిన రైతుల సందేహాలు - సమాధానాలు

83310 56028 83310 56149
83310 56150 83310 56152
83310 56153 83310 56154



1 రైతుపేరు: గొల్ల రాముడు, గ్రామం : సి. బెళగల్, మండలం: సి. బెళగల్, జిల్లా : కర్నూలు, ఫోన్ నెంబర్: 9347401708.

ప్ర. ఉల్లిలో ఆకుల మీద ఊదా రంగు మచ్చలు ఏర్పడి, పసుపు రంగులోకి మారి, ఆకు అంచుల చివర్లు ఎండిన లక్షణాలు కన్పిసున్నాయి. నివారణ చెప్పగలరు?

జ. ఉల్లిలో ఆకుమాడు తెగులు నివారణకు కార్బండిజం 1 గ్రా. లేదా మెటలాక్సిల్ 2 గ్రా. లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. + జిగురు పదార్ధం 0.5 మి.లీ.లీటరు నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలి.



2 రైతుపేరు: విప్పర్ల రామయ్య, గ్రామం : భూమనపల్లె, మండలం: దొనకొండ, జిల్లా : ప్రకాశం, ఫోన్ నెంబర్: 9398608828

ప్ర. ఆముదంలో ఆకులు కాయలపై మచ్చలు ఏర్పడి, కాయలు కుళ్ళిపోతున్నాయి. సలహా ఇవ్వండి ?

జ. ఆముదంలో కాయకుళ్ళు లేదా బూజు కుళ్ళుతెగులు నివారణకు కార్బండిజం 1 గ్రా. లేదా థయోఫొనేట్ మిథైల్ 1 గ్రా. జిగురు పదార్ధం 0.5 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలి. వర్షాలు తగ్గిన తర్వాత నేలలో తేమ ఉన్నప్పుడు ఎకరానికి యూరియా 20 కిలోలు + మ్యూరేట్ ఆఫ్ పొటాష్ 10 కిలోలు అదనం గా పైపాటుగా వేసినట్లయితే తరువాత వచ్చే గెలలు బాగా వచ్చి, నష్టాన్ని కొంతవరకు తగ్గించుకునే వీలుంటుంది.



3 రైతుపేరు:రెడ్డివారి రాజగోపాల రెడ్డి, గ్రామం : ములకతాళ్ళ మండలం: పెద్దవడుగూరు, జిల్లా : అనంతపురం, ఫోన్ నెంబర్: 8639499260

ప్ర. బత్తాయిలో ఆకులపై గజ్జి లాంటి మచ్చలు ఏర్పడుతున్నాయి. నివారణ తెలుపగలరు?

జ. బత్తాయిలో గజ్జి తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా.+ స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్ 90% + టెట్రాసైక్లిన్ హైడ్రోక్లోరైడ్ 10% 1 గ్రా. ను 10 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.



4 రైతుపేరు: గుణగంటి రామస్వామి, గ్రామం : ఈదుట్ల, మండలం: గోపల్లపేట, జిల్లా : వనపర్తి, ఫోన్ నెంబర్: 9502280472.

ప్ర. వేరుశనగ ఆకులపై ముదురు గోధుమ రంగు మచ్చలు ఏర్పడుతున్నాయి. సూచనలు ఇవ్వగలరు ?

జ. వేరుశనగలో తిక్క ఆకుమచ్చ తెగులు నివారణకు క్లోరోథలోనిల్ 2గ్రా. లేదా హెక్సాకొనజోల్ 2 మి.లీ. లేదా టెబ్యుకొనజోల్ 1 మి.లీ. + జిగురు పదార్ధం 0.5 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలి.



5 రైతుపేరు: హరీశ్, గ్రామం : రాచపల్లి, మండలం:ఉరవకొండ జిల్లా : అనంతపురం, ఫోన్ నెంబర్:8008364675

ప్ర. టమాటా ఆకులపై గోధుమ రంగుతో కూడిన మచ్చలు ఏర్పడి, క్రమేపి ఆకులు మాడి, ఎండిపోతున్నాయి. నివారణ తెలపండి ?

జ. టమాటాలో ఆకుమాడు తెగులు నివారణకు మాంకోజెబ్ 3 గ్రా. లేదా క్లోరోథలోనిల్ 2 గ్రా. లేదా ప్రొపికొనజోల్ 1 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి 15 రోజుల వ్యవధిలో 3 లేక 4 సార్లు పిచికారీ చేసుకోవాలి.



6 రైతుపేరు:శ్రీనివాస రావు, గ్రామం : దాచేపల్లి మండలం:దాచేపల్లి, జిల్లా : గుంటూరు, ఫోన్ నెంబర్:9912101590

ప్ర. పత్తి పంటలో ఆకులపై గోధుమ రంగు మచ్చలు ఏర్పడుతున్నాయి. నివారణ తెలపండి ?

జ. పత్తి పంటలో ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లేదా ప్రొపికొనజోల్1 మి.లీ.లేదా కాప్టాన్ + హెక్సాకొనజోల్ 1 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి 10-15 రోజుల వ్యవధిలో 2-3 సార్లు పిచికారీ చేసుకోవాలి.



7 రైతుపేరు: చింతల శ్రీనాథచౌదరి, గ్రామం : బొల్లాపల్లె మండలం:బల్లికురవ, జిల్లా : బాపట్ల, ఫోన్ నెంబర్: 9392519511

ప్ర. అరటిలో ఆకుల అంచుల వెంబడి పసుపుగా మారి, క్రమేపీ ఆకు మొత్తం పండిపోయి ఎండిపోతోంది, ఏమి చేయాలి ?

జ.అరటిలో పొటాష్ ధాతులోపం సవరణకు పొటాషియం నైట్రేట్ 5 గ్రా. లేదా సల్ఫేట్ ఆఫ్ పొటాష్ 5 గ్రా. + జిగురు పదార్థం 0.5 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధితో 2 సార్లు పిచికారీ చేసుకోవాలి.



8 రైతుపేరు:బాసల హనుమంతరెడ్డి, గ్రామం : బాపట్ల మండలం:బాపట్ల, జిల్లా : బాపట్ల, ఫోన్ నెంబర్: 8919899550.

ప్ర.వరిలో గింజలపై నల్లటి మచ్చలు ఏర్పడి పాలు పోసుకోక తాలు గింజలుగా అవుతున్నాయి, నివారణ తెలపండి ?

జ. వరిలో కంకి నల్లి నివారణకు ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లేదా స్పైరోమెసిఫెన్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.



9 రైతుపేరు:వివేకానంద కృష్ణప్ప, గ్రామం : పైపాళ్యం, మండలం: కుప్పం, జిల్లా : చిత్తూరు, ఫోన్ నెంబర్: 9652621025.

ప్ర. ఆలుగడ్డలో పొగాకు లద్దె పురుగు ఆశించినది, సలహా చెప్పండి ?

జ. ఆలుగడ్డలో పొగాకు లద్దె పురుగు నివారణకు ఎదిగిన గొంగళి పురుగుల నివారణకు 2 కిలోల బెల్లం, 10 కిలోల తవుడు 4 లీటర్ల నీటిలో కలిపి 24-48 గంటలు నానబెట్టి పంటలో వేయబోయే అర గంట ముందు క్లోరిపైరిఫాస్ 1 లీటరు కలిపిన విషపు ఎరను చిన్న చిన్న ఉండలుగా చేసి సాయంత్రం వేళల్లో పొలంలో మొక్కల మొదళ్ళు చుట్టూ పడేలా జల్లుకోవాలి. లింగాకర్షక బుట్టలు ఎకరానికి 4-6 చొప్పున ఉంచాలి. గుడ్ల సముదాయాల్ని ఏరి నాశనం చేయాలి. ఆముదం ను ఎర పంటగా వేయాలి.



10 రైతుపేరు: దూద్ షేక్ మహబూబ్ బాషా, గ్రామం : చాగలమర్రి, మండలం:చాగలమర్రి, జిల్లా : కర్నూలు ఫోన్ నెంబర్: 6302899150

ప్ర.మినుములో మారుకా మచ్చల పురుగు ఆశించినది, సూచన ఇవ్వండి ?

జ. మినుములో మారుకా మచ్చల పురుగు నివారణకు నోవల్యూరాన్ 1 మి.లీ. లేదా ఫ్లూబెండమైడ్ 0.2 మి.లీ. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ. లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

# సమీకృత రైతు సమాచార కేంద్రం (గన్నవరం) 155251 కు రైతుల స్పందన



1. రైతుపేరు: కె. అప్పల నాయుడు, గ్రామం: చింతాడ, మండలం: బొబ్బిలి, జిల్లా: విజయనగరం, ఫోన్ నెంబర్: 9441651079.

వరిలో సుడిదోమ నివారణకు పైమెట్రోజైన్ 120 గ్రా. ను 200 లీటర్ల నీటికి కలిపి ఎకరానికి పిచికారీ చేశాను. పురుగు చాలా వరకు తగ్గింది. సిఫారసు చేసిన సమీకృత రైతు సమాచార కేంద్ర సిబ్బందికి ధన్యవాదాలు.



2. రైతు పేరు: బాణావత్ పాపాలాల్, గ్రామం: ఎల్లంపేట, మండలం: మరిపెడ, జిల్లా: వరంగల్, తెలంగాణ, ఫోన్ నెంబర్: 9010753492.

మిరపలో తామర పురుగు నివారణకు ఐ.సి.సి. సిబ్బంది చెప్పిన విధంగా ఫిప్రోనిల్ 2 మి.లీ. ను లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేశాను. పురుగు ఉధృతి కొంత వరకు తగ్గింది. తోట బాగుంది. కృతజ్ఞతలు.



3. రైతు పేరు:మాచర్ల భాస్కర్, గ్రామం : గూడూరు, మండలం : గూడూరు, జిల్లా : కర్నూలు, ఫోన్ నెంబర్ : 9553132660.

దానిమ్మలో పేనుబంక నివారణకు థయోమిథాక్సాం 0.2 గ్రా. ను లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేశాను. పురుగు ఉధృతి కొంత వరకు తగ్గింది. సమీకృత రైతు సమాచార కేంద్ర సిబ్బందికి ధన్యవాదాలు.



4. రైతు పేరు: వి. క్రిష్ణప్ప, గ్రామం : పైపాల్యం, మండలం : కుప్పం, జిల్లా : చిత్తూరు, ఫోన్ నెంబర్ : 9652621025.

రైతు సమాచార కేంద్రం సిబ్బంది చెప్పిన విధంగా గులాబీలో బూడిద తెగులు నివారణకు మైక్లోబ్యుటానిల్ 1 గ్రా.ను లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేశాను. తెగులు ఇతర మొక్కలకు వ్యాపించలేదు. ఐ.సి.సి. సిబ్బందికి ధన్యవాదాలు.



5. రైతు పేరు:దుమ్మని చిన్నయ్య, గ్రామం : సింగరపల్లె, మండలం : బేస్తవారిపేట, జిల్లా : ప్రకాశం, ఫోన్ నెంబర్ : 8096898131.

వరిలో జింకు ధాతు లోపం సవరణకు ఐ.సి.సి. సిబ్బంది సిఫారసు మేరకు జింకు సల్ఫేట్ 2గ్రా.ను లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేశాను. పంట బాగుంది. కృతజ్ఞతలు.



6. రైతు పేరు: నల్లగట్ల సుధాకర్, గ్రామం: కొత్తపల్లి, మండలం: డోన్, జిల్లా: నంద్యాల, ఫోన్ నెంబర్:9951863511.


సమీకృత రైతు సమాచార కేంద్రం వారు చెప్పినట్లుగా కందిలో మారుకా మచ్చల పురుగు నివారణకు ఎకరాకు క్లొరాంట్రానిలిప్రోల్ 60 మి.లీ.ను 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేశాను. పురుగు ఉధృతి చాలా వరకు తగ్గింది. సలహా ఇచ్చిన ఐ.సి.సి. వారికి ధన్యవాదాలు.



7. రైతుపేరు:వెంకటరత్నం, గ్రామం : ఆత్రేయపురం, మండలం : ఆత్రేయపురం, జిల్లా : తూర్పు గోదావరి, ఫోన్ నెంబర్ :8374920204

ఐ.సి.సి. సిబ్బంది సూచన చేసిన విధంగా లిల్లీలో తామర పురుగు నివారణకు ఫిప్రోనిల్ 2 మి.లీ. ను లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేశాను. పురుగు ఉధృతిచాలా వరకు తగ్గింది. తోట బాగుంది. ఐ.సి.సి. సిబ్బందికి నా కృతజ్ఞతలు.

# ప్రకృతి వ్యవసాయం 9 సార్వత్రిక సూత్రాలు






# వ్యవసాయ మార్కెట్ ఇంటెలిజెన్స్ కేంద్రం

## ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం

AMIC ANGRAU

### వ్యవసాయ ఆర్థిక శాస్త్ర విభాగం
### ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, లాం, గుంటూరు.

ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వ్యవసాయ ఆర్థికశాస్త్ర విభాగం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం, లాం, గుంటూరులో వ్యవసాయ మార్కెట్ ఇంటెలిజెన్స్ కేంద్రంను ఒక పరిశోధన పథకంగా వ్యవసాయ పంటల ముందస్తు ధరలను అంచనా వేయుటకు రాష్ట్రీయ కృషి వికాస్ యోజన ఆర్థిక సహాయంతో స్థాపించడం జరిగింది. ఈ కేంద్రం 2024-25 సం.లో సాగుచేస్తున్న వివిధ రకాల పంటల ముందస్తు ధరలు నవంబర్ మరియు డిసెంబర్ సమయంలో ఏ విధంగా ఉండునో అంచనా వేయడం జరిగింది. ఈ విశ్లేషణ ఫలితాలు ఈ క్రింద విధముగా ఉండవచ్చును.

| క్ర. సం. | పంటలు | మార్కెట్ అంచనా ధరలు (రూ/క్వి.) | అంచనా ధరలు వర్తించు సమయం |
|---|---|---|---|
| 1 | వరి | 2,320 - 2,540 (సాధారణ రకాలు) | నవంబర్ – డిసెంబర్ 2024 |
| | | 2,620 - 2,740 (ఏ గ్రేడ్ రకాలు) | |
| 2 | మొక్కజొన్న | 2,400 - 2,650 | |
| 3 | వేరు శనగ | 5,800 - 6,850 | |
| 4 | జొన్న | 2,900 - 3,450 | |
| 5 | ప్రత్తి | 6,500 - 7,150 | |
| 6 | మిరప | 14,200 - 16,800 (సాధారణ రకాలు) | |
| | | 14,500 - 17,600 (ప్రత్యేక రకాలు) | |
| 7 | పసుపు | 10,700 - 11,500 (కాయలు) | |
| | | 11,200 - 12,800 (కొమ్ములు) | |
| 8 | కందులు | 9,800 - 10,100 | |
| 9 | మినుములు | 7,350 - 8,600 | |
| 10 | పెసలు | 6,900 - 7,650 | |
| 11 | శనగ | 5,700 - 7,350 | |

**ముందస్తు ధరలు సమాచారం కోసం సంప్రదించగలరు.....**

డా॥. వై. రాధ, ప్రధాన పరిశోధకులు

మొబైల్ నెం: +91 94419 47022, 18004198800

ఈ మెయిల్ : amic2018angrau@gmail.com వెబ్ సైట్: www.angrau.ac.in

గమనిక : పైన తెలిపిన ధరలను వివిధ పంటల ముఖ్య మార్కెట్లలో గత 16 నుండి 28 సం॥ల ధరలను విశ్లేషించి అంచనా వేయడం జరిగింది. పంట రకము, నాణ్యత, అంతర్జాతీయ ధరలు, ఎగుమతి లేదా దిగుమతి పరిమితుల మూలంగా, లేదా ప్రభుత్వ మధ్యంతర జోక్యం / వివిధ పథకాల వల్ల అంచనా ధరలలో మార్పు ఉండవచ్చును. కావున భవిష్యత్‌లో పంట ధరల మార్పునకు ఈ కేంద్రం ఏవిధమైన బాధ్యత వహించదు.

